బుధవారం
22-02-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 241
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

టర్కీలో మళ్లీ శక్తివంతమైన భూకంపం

రెండు వారాల క్రితం సంభవించిన భారీ భూకంపం ధాటికి అతలాకుతలమైన టర్కీపై మరోసారి భూకంపం విరుచుకుపడింది. హతాయ్ ప్రావిన్సులో సోమవారం శక్తివంతమైన భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 6.4 తీవ్రతతో భూకంపం వచ్చినట్టు యూరోపియన్ మెడిటేరియన్ సిస్మాలాజికల్ సెంటర్ తెలిపింది.

2లో

ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ గూండాలపై

చర్యలేవి?

సీపీఐ సూటిప్రశ్న

న్యూఢిల్లీ: దిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ) క్యాంపస్‌లో ఆర్ఎస్ఎస్-ఏబీవీపీ గూండాల విధ్వంసం, అరాచకాలను సీపీఐ తీవ్రంగా ఖండించింది. జేఎన్‌యూ క్యాంపస్‌లోని విద్యార్థి సంఘాల కార్యాలయం గోడలపై గల పెరియార్, భగత్‌సింగ్, బాబా సాహెబ్ అంబేద్కర్, కారల్ మార్క్స్, జ్యోతిబా పూలె, సావిత్రీబాయి పూలె వంటి మహనీయుల చిత్రాలను ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ గూండాలు ఫిబ్రవరి 19న ధ్వంసం చేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది.

ఈ దుర్మార్గ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి...నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. తమ సైద్ధాంతిక భావజాలాన్ని వ్యతిరేకిస్తున్న వామపక్ష, ప్రగతిశీల విద్యార్థులపై ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ కార్యకర్తలు దాడులు చేయడం ఇదే మొదటిసారి కాదని పేర్కొంది. క్యాంపస్‌లో మత సామరస్యతను విచ్ఛిన్నం చేసేందుకు మతోన్మాద శక్తులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని విమర్శించింది. విద్యార్థి సంఘం కార్యాలయం ధ్వంసాన్ని, విద్యార్థులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించింది. ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ గూండాలు ఇంతటి దారుణాలకు పాల్పడుతున్నా యూనివర్సిటీ యంత్రాంగంగానీ, దిల్లీ పోలీసులు గానీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించింది. ఇలాంటి ఘటనలను సహించేది లేదని స్పష్టంచేసింది.

వంచనకు కుట్ర

- మూడు రాజధానులపై ఆగని వైసీపీ యత్నాలు
- పార్లమెంటులో ప్రైవేటు బిల్లుకు సన్నద్ధం
- ఇప్పటికే లోక్‌సభకు నోటీసిచ్చిన మార్గాని భరత్



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: చట్టపరంగా మూడు రాజధానుల బిల్లును శాసనసభలో ఉపసంహరించుకుని... ఆ మేరకు హైకోర్టులో సైతం అఫిడవిట్ దాఖలు చేసిన వైసీపీ ప్రభుత్వం... ప్రజల్లో మాత్రం మూడు రాజధానులపై తాము ముందుకెళుతున్నామన్న భ్రమలు కల్పించడానికి ప్రయత్నిస్తోంది. ప్రజలను నమ్మించడానికిగాను అన్ని అవకాశాలపై నిత్య అన్వేషణ కొనసాగిస్తోంది. రాష్ట్ర రాజధాని ఎంపిక ప్రక్రియ పూర్తయినందున విభజన చట్టం ప్రకారం మరలా మూడు రాజధానులు ఏర్పాటు చేసే అధికారం రాష్ట్రానికి లేదని గతంలో హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. అయితే ఆ తీర్పు వచ్చేనాటికే మూడు రాజధానుల బిల్లును వెనక్కి తీసుకుంటున్నట్లు, అసెంబ్లీలోనూ ఉపసంహరించుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. కేవలం అమరావతి రాజధానిని విధ్వంసం చేయడానికే మూడు రాజధానుల పల్లవి అందుకున్న అధికారపార్టీ...రాజకీయ ప్రయోజనాల కోసం ఆ నినాదాన్ని మాత్రం నిరంతర ప్రచార అస్త్రంగా ఉపయోగిస్తోంది. వాస్తవానికి మూడు రాజధానుల నిర్మాణానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నం వీసమంత కూడా లేదు. నాలుగు సంవత్సరాలుగా కేవలం నినాదానికి మాత్రమే దానిని పరిమితం చేసింది. చివరకు కర్నూలులో న్యాయ రాజధానిపైనా సుప్రీంకోర్టు ప్రభుత్వ అభిప్రాయాన్ని అడిగిన సందర్భంలో సైతం తమకు ఆ ఉద్దేశమే లేదని స్పష్టం చేసింది. చట్టపరంగా అసెంబ్లీలో, హైకోర్టులో మూడు రాజధానుల బిల్లు ఉపసంహరించుకోవడంతో పాటు సుప్రీంకోర్టులో సైతం కర్నూలులో హైకోర్టు ఏర్పాటు ఉద్దేశం లేదని స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం... ప్రచారంలో మాత్రం అధికార పార్టీ నేతలు తాము మూడు రాజధానులకు కట్టుబడి ఉన్నామని, పరిపాలనా వికేంద్రీకరణే లక్ష్యమని చెపుతూ ప్రజలను మోసం చేస్తున్నారు. హైకోర్టు తీర్పుపై చివరి రోజు వరకు అప్పీలుకు వెళ్లని రాష్ట్ర ప్రభుత్వం... రాజధాని ఎక్కడ పెట్టాలో నిర్ణయించుకునే అధికారం శాసనసభకు లేదని హైకోర్టు తీర్పు ఇవ్వడం దారుణమంటూ సుప్రీంను ఆశ్రయించింది. దీనినే మూడు రాజధానులకు కట్టుబడి చేస్తున్న పోరాటంగా వైసీపీ చిత్రీకరిస్తోంది. మరో ఏడాదిలో సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో మూడు రాజధానుల ప్రచారాన్ని కొంతైనా నిజం చేయాలన్న యోచనతో సీఎం క్యాంపు కార్యాలయాన్ని సాధ్యమైనంత త్వరగా విశాఖలో

- మిగతా 2 లో

సకాలంలో రాని 108

కడుపులోనే మృతిచెందిన చిన్నారి

విశాలాంధ్ర-హుకుంపేట (అల్లూరి జిల్లా): ప్రభుత్వాలు ఎన్ని మాటలు చెప్పినా ఏజెన్సీ ప్రాంతంలో వైద్య సేవలు అందక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ప్రత్యేకించి గర్భిణీలు సకాలంలో ఆసుపత్రికి చేరకపోవడంతో తల్లి లేదా బిడ్డ, ఒక్కోసారి ఇద్దరూ ప్రాణాలు కోల్పోతున్నారు. 108 సైతం సకాలంలో సేవలు అందించలేకపోతోంది. తాజాగా డోలీలో గర్భిణీని తరలించినా చిన్నారి మృతి చెందిన సంఘటన అల్లూరి జిల్లా హుకుంపేట

- మిగతా 2 లో

అదానీ గ్రూప్‌పై

మరో విమర్శ

వికీపీడియా సమాచారం తారుమారు?

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ కొత్త వివాదంలో చిక్కుకుంది. హిండెన్‌బర్గ్ వ్యవహారంలో సరికొత్త ట్విస్ట్ చోటుచేసుకుంది. అదానీ గ్రూప్‌పై సంచలన నివేదిక వెలువరించిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఫౌండర్ నాథన్ అండర్సన్ తాజాగా చేసిన ఒక ట్వీట్ అదానీని మరింత ఇబ్బందుల్లోకి నెట్టే అవకాశం ఉంది. వికీపీడియాలోని సమాచారాన్నీ తారుమారు చేశారన్నది తాజా ఆరోపణ. గౌతమ్ అదానీ, ఆయన కుటుంబ సభ్యులు, గ్రూప్ కంపెనీలకు సంబంధించి పక్షపాతంతో కూడిన కంటెంట్‌ను యాడ్ చేశారని, వికీలో హెచ్చరికలనూ తొలగించారని వికీపీడియా ఆరోపించింది. ఇందుకోసం సాక్ పప్పెట్ ఖాతాలను, పెయిడ్ ఎడిటర్లను వినియోగించారని పేర్కొంది. ఇలా కంటెంట్‌లో మార్పు చేసిన వారిలో అదానీ గ్రూప్ కంపెనీ ఉద్యోగులూ ఉన్నారని తెలిపింది. ఇదే కథనాన్ని తన ట్వీట్‌కు జోడిస్తూ గౌతమ్ అదానీపై మరోమారు విమర్శలు గుప్పించాడు నాథన్ అండర్సన్. పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సాక్ష్యాలు దొరకకుండా చేసేందుకు.. అదానీ సాక్ పప్పెట్ అకౌంట్లు, అన్‌డిక్లేర్డ్ పెయిడ్ ఎడిటర్లను ఉపయోగించి అదానీ కుటుంబం, దాని వ్యాపారాలపై కథనాలను సృష్టించడం లేదా సవరించడం జరిగిందని సైన్‌పోస్ట్ కథనాన్ని ఉటంకించాడు నాథన్ అండర్సన్. కంపెనీ ఐపీ అడ్రస్‌ను ఉపయోగించి, అదానీ గ్రూప్ ఆర్టికల్స్‌ను తిరిగి రాశారని, నాన్- న్యూట్రల్ మెటీరియల్, కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రెస్ట్ పార్ట్స్‌ను తొలగించారని సైన్‌పోస్ట్ పేర్కొంది. దాదాపు 9 కథనాలను సృష్టించినట్లు ఆ కథనం వెల్లడించింది.

అదానీ గురించి 2007లో ఆర్టికల్స్ మొదలయ్యాయని, అవన్నీ

- మిగతా 2 లో

నిర్వాసితులకు తీవ్ర అన్యాయం

- చట్ట ప్రకారం పరిహారం అందజేయాలి
- న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం: రామకృష్ణ
- ఆఫ్‌షోర్ ప్రాజెక్టును పరిశీలించిన సీపీఐ బృందం

విశాలాంధ్ర-పలాస: శ్రీకాకుళం జిల్లా పలాస మండలం రేగులపాడు వద్ద నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయరు ప్రాజెక్టుకు సంబంధించి భూములు కోల్పోయిన నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరిగిందని, 2013 చట్టం ప్రకారం నిర్వాసితులందరికీ నష్టపరిహారం అందజేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా రామకృష్ణ నాయకత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం ఆఫ్‌షోర్ రిజర్వాయరు ప్రాజెక్టు పనులను మంగళవారం పరిశీలించింది. అనంతరం రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాజెక్టుల స్థితిగతులు పరిశీలించేందుకు సీపీఐ బృందం పర్యటిస్తోందని, ఇప్పటికే రాయలసీమ, ప్రకాశం జిల్లాలో ఉన్న వెలుగొండ ప్రాజెక్టు, రాష్ట్ర ప్రజల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పరిశీలించామని చెప్పారు. ఇప్పుడు ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాజెక్టులు సందర్శిస్తున్నామన్నారు. మహేంద్రతనయ నదిపై నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయరు ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. 2008 ఏప్రిల్ 4న అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఆఫ్‌షోర్‌కు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఆఫ్‌షోర్ నిర్వాసితులకు అందజేసిన నష్టపరిహారం చాలదని, 2013లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ సేకరణ చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వమైనా, కేంద్ర ప్రభుత్వామైనా నిర్వాసితులందరికీ ఒకే రీతిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ తరపున డిమాండ్ చేస్తున్నామని రామకృష్ణ చెప్పారు. వెలుగొండ ప్రాజెక్టుకు సంబంధించి ప్రతి ఇంటికీ ప్యాకేజీ కింద రూ.12.50 లక్షలు ఇస్తున్నారని, అయితే నిర్వాసితులు రూ.18 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. ఆఫ్‌షోర్‌లో భూములు కోల్పోతున్న చీపురుపల్లి రైతుల తరపున సర్పంచ్ ఈశ్వరరావు కేవలం 5 లక్షల రూపాయలు డిమాండ్ చేస్తున్నట్లు తన దృష్టికి తీసుకొచ్చారని, అలా కాకుండా రాష్ట్రంలో ఎక్కడైనా నిర్వాసితులందరికీ ఒకే రీతిలో ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. అన్ని ప్రాజెక్టులు సందర్శించిన తర్వాత విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని, అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, సాగునీటిరంగ నిపుణులను ఆహ్వానించి ఈ సమస్యలన్నింటిపై చర్చిస్తామని, చివరిగా

- మిగతా 2 లో

మరో కొత్త వైద్య కళాశాల

- విజయనగరంలో ప్రభుత్వ కళాశాల
- 150 సీట్లకు అనుమతిస్తూ ఎన్ఎంసీ ఉత్తర్వులు
- ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రానికి మరో కొత్త ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరైనట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని మంగళవారం తెలిపారు. విజయనగరంలో ఈ ఏడాది నుంచి ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభించేందుకు జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) అనుమతులు మంజూరు చేసిందని వెల్లడించారు. ఈ నెల మూడో తేదీన ఎన్ఎంసీ విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలలో తనిఖీలు నిర్వహించిందని చెప్పారు. ఆ సమయంలో అక్కడి నిర్మాణాలు, బోధన, బోధనేతర సిబ్బంది, వసతులు, ల్యాబ్‌లు, లైబ్రరీ, హాస్టళ్లు, ఆస్పత్రి, బోధనా సిబ్బంది అనుభవం, వారి పబ్లికేషన్లు, అందుబాటులో ఉన్న నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది ఇలా అన్ని అంశాలను ఎన్ఎంసీ క్షుణ్ణంగా పరిశీలించిందని వివరించారు. ప్రభుత్వం సమకూర్చిన వసతులు, సిబ్బంది నియామకాలతో సహా అన్ని అంశాలపై సంతృప్తి చెందిన ఎన్ఎంసీ...ఈ ఏడాది నుంచే తరగతులు నిర్వహించుకోవడానికి అనుమతులు మంజూరు చేసిందని వివరించారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వానికి ఉత్తర్వులు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

బాగా వివరించాను సార్, వారు కూడా తిరిగి గట్టిగా...

వైసీపీ నేతల్లో ఎమ్మెల్సీ చిచ్చు

సీనియర్లకు దక్కని చోటు

ఉత్తరాంధ్రలో ముస్లింలకు మొండి చెయ్యి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : పార్టీ కోసం ఎంతో కాలం నుంచి కష్టపడుతున్నప్పటికీ ఎమ్మెల్సీ పదవుల్లో సీనియర్లకు చోటు దక్కడం లేదని ఉమ్మడి విశాఖ జిల్లాలో అనేక మంది నేతలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఎమ్మెల్యే టికెట్లు దక్కకపోయినా కనీసం ఎమ్మెల్సీ స్థానాలైనా తమకు ఇస్తారని ఆశతో ఎదురుచూసిన నేతలకు తాజాగా ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటనతో నిరాశ ఎదురయిందని అనేక మంది నేతలు పెదవి విరుస్తున్నారు. పార్టీలో సీనియర్ నేతలుగా ఉన్న తమను పక్కనపెట్టి జూనియర్లకు ఎమ్మెల్సీలు కట్టబెట్టడంపై సీనియర్లంతా గుర్రుగా ఉన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని కొంతమంది బాహటంగానే నేతల వద్ద తెలియజేసినట్లు సమాచారం. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో ముస్లింలకు ఒక ఎమ్మెల్సీ పదవి కూడా ఇవ్వకపోవడంపై ముస్లిం మైనారిటీ వర్గం నేతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ కోసం గత 10 ఏళ్లుగా పని చేస్తున్న తమకు నామినేటెడ్ పోస్టులు కూడా దక్కలేదని అంటున్నారు. మాజీ మంత్రులు పసుపులేటి బాలరాజు, దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణ రాజు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయ్ కుమార్, ఎస్.ఎ.రెహమాన్, ముస్లిం మైనారిటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ఐ ఫరూఖీ చాలా కాలం నుంచి ఎమ్మెల్సీ పదవుల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిసింది. సోమవారం ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటనలో మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులకు, ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబుకు చోటు దక్కింది. ఒకరు విశాఖ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించగా, మరొకరు అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందినవారు. విశాఖ

- మిగతా 2 లో

శాసన మండలి రద్దుకు తీర్మానం చేసిన జగన్‌కు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లడిగే హక్కులేదు

- మండలి దండగ, ప్రజా ప్రయోజనం లేదన్న విషయం మరిచారా?
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్‌ల సమావేశంలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: శాసన మండలి రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసిన సీఎం జగన్‌కు, ఇప్పుడు మండలి ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు ఎక్కడిదని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ ఇన్‌చార్జ్‌లు, ముఖ్యనేతలతో చంద్రబాబు మంగళవారం ఆన్‌లైన్‌లో సమావేశంలో మాట్లాడుతూ తన మాట నెగ్గలేదనే అహంకారంతో నాడు ఏకపక్షంగా జగన్ మండలి రద్దుకు తీర్మానం చేయలేదా? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనమండలి వల్ల ప్రజా ప్రయోజనం లేదని ట్రెజరీ నుంచి ఒక్క రూపాయి ఖర్చు పెట్టడం కూడా దండగే అని జగన్ అనలేదా అని చంద్రబాబు ప్రశ్నించారు. మండలి లాంటి వ్యవస్థలను అగౌరపరిచిన ముఖ్యమంత్రి ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థులను నిలబెట్టి.ఓట్లు అడుగుతారో సమాధానం చెప్పాలన్నారు. టీడీపీ నేతలంతా ఈ ఎమ్మెల్సీ ఎన్నికలను సీరియస్ గా తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉందని, తెలుగుదేశానికి పరిస్థితి అనుకూలంగా ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో వచ్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించాలని చంద్రబాబు నేతలకు సూచించారు. ఈ ఎన్నికలు ఇన్‌చార్జ్‌లు, నేతల పనితీరు, సమర్థతకు పరీక్షగా

- మిగతా 2 లో

బంగ్లాదేశ్‌లో ప్రముఖ వార్తాపత్రికపై నిషేధం

ఢాకా: ప్రముఖ వార్తా పత్రిక 'దైనిక్ దినకాల్'పై బంగ్లాదేశ్ ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ పత్రిక ప్రధాన ప్రతిపక్షం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ)కి చెందినది. ప్రభుత్వ ఆంక్షలతో వందలాది మంది జర్నలిస్టులు, ప్రెస్ కార్మికులతో మూడు దశాబ్దాలుగా నడుస్తున్న పత్రిక మూగపోయిందని స్థానిక మీడియా పేర్కొంది. అలాగే బీఎన్‌పీ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించడంతో పాటు అరెస్టులు చేసినట్లు వివరించింది. గతేడాది డిసెంబర్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూసివేత ఆదేశాలను బంగ్లాదేశ్ ప్రెస్ కౌన్సిల్ కూడా సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేసింది. దేశంలోని ముద్రణ, ప్రచురణ చట్టాలను ఉల్లంఘించినందున వార్తాపత్రిక ముద్రణ అనుమతిని రద్దు చేసినట్లు ఆ ప్రకటనలో తెలిపింది. బీఎన్‌పీ యాక్టింగ్ చీఫ్, పేపర్ పబ్లిషర్ తారిక్ రెహమాన్ తన బాధ్యతలను మరెవరికీ అప్పగించకుండా విదేశాలకు వెళ్లడంతో ఆయనను నిందితుడిగా నిర్ధారిస్తున్నట్లు కౌన్సిల్ తెలిపింది. ప్రభుత్వ, బంగ్లాదేశ్ ప్రెస్ కౌన్సిల్ ఆరోపణలను దైనిక్ దిన్‌కాల్ మేనేజింగ్ ఎడిటర్ షిముల్ బిస్వాస్ ఖండించారు. తారిక్ రెహమాన్ వార్తాపత్రిక బాధ్యతలకు రాజీనామా చేశారని, కొన్నేళ్లుగా ఆయన లండన్‌లో నివసిస్తున్నారని తెలిపారు. కానీ ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించారంటూ నిషేధం విధించిందని మండిపడ్డారు. ముద్రణను నిలిపివేయాలంటూ జిల్లా మెజిస్ట్రేట్ ఇచ్చిన ఆదేశాలను వెనక్కు తీసుకోవాల్సిందిగా ప్రెస్ కౌన్సిల్‌ను కోరగా తిరస్కరించినట్లు తెలిపారు.

లాహోర్‌లో ముంబై దాడుల ఉగ్రవాదులు

న్యూఢిల్లీ: ప్రముఖ కవి, సినీ గేయ రచయిత జావెద్ అక్తర్ పాకిస్తాన్‌ను ఆ దేశంలోనే విమర్శించారు. 26/11 ముంబై ఉగ్రపేలుళ్ల ఘటనను గుర్తుచేసుకున్న ఆయన... ఆ దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఇంకా లాహోర్‌లో స్వేచ్ఛగా తిరుగతున్నారంటూ దుయ్యబట్టారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రముఖ ఉర్దూ కవి ఫైజ్ అహ్మద్ స్మారకార్థం ఇటీవల లాహోర్‌లో ఫైజ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జావెద్ అక్తర్‌కు ఆహ్వానం లభించడంతో ఆయన పాక్‌లో పర్యటించారు. ఈ ఫెస్టివల్‌లో పాల్గొన్న ఆయన... అక్కడ విలేకరులతో మాట్లాడుతూ భారత్-పాక్ సంబంధాలు, ముంబై ఉగ్రదాడుల ఘటనను ప్రస్తావించారు. "ఒకరిపై ఒకరు నిందలు వేసుకున్నంత మాత్రాన సమస్య పరిష్కారం కాదు. పైగా ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయి. వాటిని తగ్గించాల్సిన అవసరముంది. మేం ముంబైకి చెందిన వాళ్లం. మా నగరంలో ఉగ్రవాదులు ఎంతటి బీభత్సాన్ని సృష్టించారో మా కళ్లారా చూశాం. వారు(ముష్కరులు) నార్వే లేదా ఈజిప్టు నుంచి వచ్చిన వారు కాదు. వాళ్లు ఇంకా మీ దేశంలోనే స్వేచ్ఛగా తిరుగుతున్నారు కదా. అలాంటప్పుడు భారత్ దాని గురించి ఫిర్యాదులు చేసినప్పుడు మీరు దాన్ని ప్రతికూలంగా తీసుకోవాల్సిన అవసరం లేదు" అని అక్తర్ వ్యాఖ్యానించారు. ఇక భారత ఆర్టిస్టులను పాక్ లో గౌరవించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. "నుస్రత్ ఫతే అలీ ఖాన్, మెహదీ హసన్ లాంటి పాక్ కళాకారుల గౌరవార్థం మేం పెద్ద కార్యక్రమాలు చేపడుతున్నాం. కానీ లతా మంగేష్కర్ కోసం పాక్ ఎప్పుడైనా ఫంక్షన్ ఏర్పాటు చేసిందా?" అని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన వీడియోలను కొందరు సోషల్‌మీడియాలో పోస్ట్ చేయగా.. ప్రస్తుతం ఆ వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

టర్కీలో మళ్లీ శక్తివంతమైన భూకంపం

- ముగ్గురు మృతి... 200 మందికిపైగా గాయాలు
- బలహీనంగా ఉన్న భవనాలు నేలమట్టం
- రిక్టర్ స్కేల్‌పై 6.4 తీవత్ర నమోదు

అంకారా: రెండు వారాల క్రితం సంభవించిన భారీ భూకంపం ధాటికి అతలాకుతలమైన టర్కీపై మరోసారి భూకంపం విరుచుకుపడింది. హతాయ్ ప్రావిన్సులో సోమవారం శక్తివంతమైన భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 6.4 తీవ్రతతో భూకంపం వచ్చినట్టు యూరోపియన్ మెడిటేరియన్ సిస్మాలాజికల్ సెంటర్ తెలిపింది. టర్కీ విపత్తు నిర్వహణ సంస్థ కూడా దీనిని ధ్రువీకరించింది. భూకంప కేంద్రం దక్షిణ టర్కీ నగరం అంటాక్యా సమీపంలోని 10 కిలోమీటర్ల లోతున ఉన్నట్లు గుర్తించారు. దీని ప్రభావం సిరియా, ఈజిప్టు, లెబనాన్‌లోనూ కనిపించింది. తాజా భూకంపం కారణంగా ఇప్పటికే బలహీనపడిన కొన్ని భవనాలు కూలిపోయాయి. హతాయే మేయర్ లుత్‌ఫు సవస్ మాట్లాడుతూ... ఇప్పటికే బలహీనపడిన కొన్ని భవనాలు కూలిపోయి శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్టు నివేదికలు అందాయన్నారు. ఇప్పటి వరకూ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని, 200 మంది గాయపడ్డారని టర్కీ హోంశాఖ మంత్రి సులేమాన్ సోయ్‌లూ చెప్పారు. టర్కీ విపత్తు నిర్వహణ సంస్థ మాత్రం ఒకరు మాత్రమే చనిపోయారని, చాలా భవనాలు కూలిపోయినట్టు స్థానికులు చెప్పినా రెండు వారాల కిందట సంభవించిన భూకంపం తర్వాత భయంతో పట్టణవాసులు వేరే చోటకు వెళ్లిపోయారని చెప్పింది. 'భూమి మళ్లీ కంపించడం మొదలైనప్పుడు నా కాళ్ల కింద భూమి చీలిపోతుందని నేను అనుకున్నాను' అని సెంట్రల్ అంటాక్యాకు చెందిన మునా అల్ ఒమర్ అనే ఓ మహిళ కన్నీరుపెట్టుకుంది. ఓ పార్కులో టెంట్ వేసుకుని తన ఏడేళ్ల కుమారుడితో బిక్కుబిక్కుమని గడుపుతోంది. ఇక, ఫిబ్రవరి 6న సంభవించిన భూకంపం కారణంగా టర్కీ, సిరియాలో 47 వేల మందికిపైగా మృతిచెందారు. ఒక్క టర్కీలో 41,156 మంది ప్రాణాలు కోల్పోగా.. లక్షల మంది గాయపడ్డారు. 3,85,000 భవనాలు కూలిపోయాయి. భూకంపంతో అతలాకుతలమైన టర్కీకి ప్రపంచ దేశాలు ఆపన్నహస్తం అందిస్తున్నాయి.

సహాయక చర్యల కోసం బలగాలను పంపి, సామాగ్రిని కూడా అందజేస్తున్నాయి. భారత్ నుంచి ఎమర్జెన్సీ సిబ్బంది, వైద్య బృందాలు టర్కీలోని దక్షిణ ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. కాగా, భూకంప బాధితుల్లో 3,56,000 మంది గర్భిణిలు ఉన్నారని, వారికి అత్యవసర వైద్య సేవలు అందజేయాల్సిన అవసరం ఉందని ఐక్యరాజ్యసమితి లింగ, పునరుత్పత్తి ఆరోగ్య విభాగం పేర్కొంది. టర్కీలో 226,000, సిరియాలో 130,000 మంది గర్భిణీలు ఉండగా.. వీరిలో 38,800 మందికి వచ్చే నెలలో ప్రసవాలు జరగనున్నాయి. చాలా మంది సహాయక శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఓవైపు శీతల వాతావరణం.. మరోవైపు సరైన ఆహారం, తాగు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు.

వైసీపీ నేతల్లో ఎమ్మెల్సీ చిచ్చు

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలో, నగరంలో జనాభా ప్రాతిపదికన ముస్లిం మైనారిటీ ఓటర్లు అధికంగా ఉన్నప్పటికీ ముస్లిం మైనారిటీ సామాజిక వర్గానికి పెద్దపీట వేయలేదని మైనారిటీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌ఐ ఫరూఖీకి ఎప్పటినుంచో ఎమ్మెల్సీ ఇస్తామని అధిష్టానం చెప్పినా ఈసారి కూడా చోటు దక్కకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లోనే ఒక్క ఎమ్మెల్సీ స్థానం కూడా, ఒక్క నామినేటెడ్ పదవి కూడా ముస్లింలకు కేటాయించకపోవడంపై ఆ వర్గం నేతలు అధిష్టానంపై అసంతృప్తితో రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. తాజా ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటనలో అనకాపల్లి జిల్లాకు ప్రాతినిధ్యం లేకపోవడంపై కూడా ఆశావహుల్లో అసంతృప్తి రగులుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

సకాలంలో రాని 108

(మొదటి పేజీ తరువాయి)

మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో తీగలవలస పంచాయతీ పనసబంధ గ్రామానికి చెందిన వంతాల భానుకు మంగళవారం పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో భర్త నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. మూడు గంటలైనా అంబులెన్స్ రాలేదు. దీంతో పనస బంధ నుంచి డోలీ ద్వారా తీగలవలస రహదారి వరకు గర్భిణీని తీసుకొచ్చారు. అక్కడ నుంచి ఆటోలో హుకుంపేట ఆసుపత్రికి తరలించారు. కడుపులో బిడ్డ అడ్డం తిరిగిందని వైద్య సిబ్బంది అతి కష్టంపైన ప్రసవం చేశారు. అప్పటికే బిడ్డ మృతి చెందినట్లు తెలిపారు. సకాలంలో 108 వచ్చి ఉంటే బిడ్డ ప్రాణాలు దక్కేవని కుటుంబ సభ్యులు, గిరిజన సంఘ నాయకులు కృష్ణారావు, కొండలరావు ఆరోపించారు.

మరో కొత్త వైద్య కళాశాల

(మొదటి పేజీ తరువాయి)

అందాయని మంత్రి రజిని చెప్పారు. ఈ కాలేజీకి మొత్తం 150 సీట్లు మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో రూ.8500 కోట్లతో మొత్తం 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణాన్ని జగనన్న చేపట్టారని మంత్రి తెలిపారు. వీటిలో తొలిసారిగా ఉత్తరాంధ్రకు చెందిన విజయనగరం కళాశాలకు అనుమతులు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచే రాష్ట్రంలో మరో నాలుగు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రారంభించాలనే దృఢ నిశ్చయంతో ప్రభుత్వం ముందుకు వెళుతోందని పేర్కొన్నారు. మచిలీపట్టణం, ఏలూరు, విజయనగరం, నంద్యాల, రాజమండ్రిల్లోనూ వైద్య కళాశాలలు ప్రారంభమయ్యేలా ఇప్పటికే అన్ని వసతులు సమకూర్చుతున్నామన్నారు. పీజీ సీట్లను గణనీయంగా పెంచుకునే విషయంలోనూ కృషి చేస్తున్నామని, గతంలో 911 పీజీ సీట్లు ఉండగా, ప్రస్తుతం 1249కి పెరిగాయని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లడిగే హక్కులేదు

(మొదటి పేజీ తరువాయి)

ఉండబోతున్నాయన్నారు. ఈస్ట్ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, వెస్ట్ రాయలసీమ గ్రాడ్యుయేట్‌ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి వి.చిరంజీవి రావులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. పాలనలో అన్ని విధాలా విఫలమైన జగన్ ఇప్పుడు తీవ్ర అసహనంతో ఉన్నారని... అందులో భాగంగానే రాష్ట్రంలో టీడీపీ నేతల పర్యటనలు, సభలపై ఆంక్షలు పెడుతున్నారని విమర్శించారు. గన్నవరం దాడులు జగన్ ఆలోచనలకు, మనస్తత్వానికి నిదర్శనంగా పేర్కొన్నారు.

వంచనకు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించాలని సీఎం జగన్ ప్రయత్నిస్తున్నారు. విశాఖలో జరగనున్న జీ-20 సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి అక్కడే మకాం వేసి, ఆ తర్వాత కూడా అక్కడే సమీక్షా సమావేశాలు నిర్వహించాలనే యోచనలో ఉన్నారు. తద్వారా పరిపాలనా రాజధాని విశాఖకు మారినట్లు ప్రజలను భ్రమింపజేయాలనే యోచనతో పాలకపెద్దలున్నారు. తాజాగా వైసీపీ ఎంపీ మార్గాని భరత్ లోక్‌సభలో ప్రైవేటు మెంబర్ బిల్లు పెట్టేందుకు నోటీసిచ్చారు. ఏపీలో మూడు రాజధానుల ఏర్పాటుతో పాటు విభజన హామీలు నెరవేర్చేందుకు వీలుగా విభజన చట్టంలో సవరణలు చేయాలని కోరుతూ మార్గాని భరత్ ప్రైవేటు మెంబర్ బిల్లు పెట్టేందుకు లోక్‌సభ అనుమతి కోరారు. దీన్ని పరిశీలించిన లోక్‌సభ సచివాలయం ఈ ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపింది. దీనిపై తగు చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇస్తున్నట్లు ఎంపీకి సమాచారం పంపినట్లు తెలిసింది. దీంతో ప్రైవేటు మెంబర్ బిల్లు త్వరలోనే పార్లమెంటు ముందుకు రాబోతోంది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో దీనిపై కేసు నడుస్తున్నందున పార్లమెంటులో ఈ బిల్లుపై చర్చించే అవకాశాలు తక్కువేనంటున్నారు. ఒకవేళ బీజేపీతో ఉన్న సత్సంబంధాలను వినియోగించి లోక్‌సభలో చర్చకు ఆహ్వానించి విభజన చట్టంలో మార్పులు చేయగలిగితే మాత్రం మూడు రాజధానులకు లైన్ క్లియర్ అవుతుందన్న ఆశలో వైసీపీ నేతలున్నారు. అప్పుడు సుప్రీంకోర్టు తీర్పుతో సంబంధం లేకుండానే మూడు రాజధానుల ప్రక్రియ చేపట్టేందుకు ఏపీ అసెంబ్లీకి అవకాశం ఉంటుందని, ప్రస్తుతం శాసనమండలిలోనూ వైసీపీ మెజార్టీ పెరిగినందున రెండుసభల్లో మరోసారి మూడు రాజధానుల బిల్లును ఆమోదింపజేసుకోవచ్చని అధికారపార్టీ నేతలు భావిస్తున్నారు. ఇదంతా ప్రజలను మభ్యపెట్టడానికి వైసీపీ ప్రచారానికి ఉపయోగపడుతుందేమో కానీ...ఆచరణలో మాత్రం అమరావతి రాజధానిని నిర్వీర్యం చేయడం అసాధ్యమని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

శాంతియుత పరిష్కారమే కోరుకుంటున్నా: పుతిన్

మాస్కో: వారాలు.. నెలలు అనుకున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఏడాదికి చేరుకుంది. రష్యా ఆక్రమణతో మొదలైన ఈ యుద్ధం ఉక్రెయిన్ వీరోచిత ప్రతిఘటనతో ఇంతకాలంగా కొనసాగుతూ వస్తున్నది. ఇప్పటికే అంతర్జాతీయంగా తీవ్ర ప్రభావం కలిగించిన ఈ యుద్ధం ఎలా ముగుస్తుందా అని ప్రపంచం ఆశతో ఎదురు చూస్తున్నది. కానీ, అది ఇప్పట్లో నెరవేరేలా కనిపించటం లేదు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ సమస్యను శాంతియుతంగానే పరిష్కరించాలనుకున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తెలిపారు. అయితే పశ్చిమ దేశాలు మాత్రం సమస్యను జటిలం చేస్తున్నాయన్నారు. సోమవారం ఆయన ఫెడరల్ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించారు. ఉక్రెయిన్‌పై దాడికి వెళ్లడానికి పశ్చిమ దేశాలే కారణమని ఆయన అన్నారు. పదేపదే ఆయన ఆ ఆరోపణలే చేశారు. పశ్చిమ దేశాలు తూర్పు దిశగా దూకుడు పెంచాయని, తూర్పు దేశాలను నాశనం చేయాలన్న ఉద్దేశంతో పశ్చిమ దేశాలు ఉన్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సమస్యను పశ్చిమ దేశాలు ప్రపంచ సమస్యగా మారుస్తున్నాయని ఆయన విమర్శలు చేశారు. నాటో దళాన్ని పెంచుతూ.. పశ్చిమ దేశాలు దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్‌పై యుద్ధానికి పశ్చిమ దేశాలే కారణమని, వాళ్ల దూకుడును అడ్డుకునేందుకు సైన్యాన్ని వాడుతున్నామని పుతిన్ తెలిపారు. డాన్‌బాస్ ప్రాంతంలో సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు ప్రయత్నించామన్నారు. కానీ పశ్చిమ దేశాలు క్రూరపద్ధతిలో వ్యవహరించాయన్నారు. సైనికులకు, వాళ్ల కుటుంబాలకు పుతిన్ కృతజ్ఞతలు తెలిపారు. శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు చెప్పారు. పుతిన్ తన ప్రసంగంలో ఎల్జీబీటీ హక్కుల గురించి మరోసారి ప్రత్యేకంగా ప్రస్తావన చేశారు. ఫ్యామిలీ అంటే ఆడ, మగ కలయిక అని, ప్రతి మత గ్రంథాలు ఈ విషయాన్నే చెబుతాయని, కానీ ఆ పవిత్ర గ్రంథాలను పశ్చిమ దేశాలు అనుమానిస్తున్నాయన్నారు. దిగజారుడతనం నుంచి మన చిన్నారుల్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని పుతిన్ పేర్కొన్నారు.

గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడికి ఖండన

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కృష్ణాజిల్లా గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై వైసీపీ శ్రేణుల విధ్వంసకరమైన దాడిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. కృష్ణాజిల్లా గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై వైసీపీ వర్గీయులు తీవ్రంగా దాడిచేసి ఫర్నిచర్ ధ్వంసం చేయడం, కార్లు తగులబెట్టడం వంటి దుశ్చర్యలను తప్పుపట్టారు. ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రతిపక్ష పార్టీలపై దాడులు, బెదిరింపులు, వేధింపులు, విధ్వంసాలకు తెగబడుతోంది. పోలీసులను ప్రయోగించి అక్రమ అరెస్టులకు పాల్పడుతోందన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛకు తూట్లు పొడుస్తోందని పేర్కొన్నారు.

గన్నవరంలో విధ్వంసానికి పాల్పడిన వైసీపీ శ్రేణులను వదిలేసి, టీడీపీ వారిని పోలీసులు అరెస్టులు చేసి, అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమని, పోలీసులు స్వతంత్ర ప్రతిపత్తిని వదిలి, అధికార వైసీపీకి అనుకూలంగా వ్యవహరించడం, రాజకీయాల్లో విమర్శలకు ప్రతి విమర్శలే సమాధానంగా ఉండాలేగాని భౌతిక దాడులకు తెగబడడం, విధ్వంసాలు సృష్టించడం తగదని పేర్కొన్నారు. వైసీపీ శ్రేణుల దాడులను, విధ్వంసాన్ని ప్రజాతంత్ర వాదులంతా ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిని నిన్న అక్రమంగా అరెస్టుచేసి, పోలీసులు ఆయనను కొట్టి హింసించినట్లు తెలుస్తోందని, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తూ కక్షపూరితంగా వ్యవహరించడం పోలీసు వ్యవస్థకు మాయనిమచ్చన్నారు. పట్టాభిపై భౌతిక దాడికి తెగబడిన పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలని, గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడికి కారకులైన వారిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

పోలీసుల అండతో దారుణకాండ: సీపీఎం

రాజకీయ భావావేశాలను భౌతికదాడులుగా మార్చి అధికార పార్టీ పోలీసుల అండతో ఈ దారుణకాండకు పాల్పడడం హేయమని, ఇలాంటి దాడులను తక్షణం నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీల కార్యాలయాలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్రవహించడంతోపాటు 24 గంటల తరువాత కూడా కేసు నమోదు చేయకపోవడం, నిందితులను అరెస్టు చేయకపోవడం అన్యాయమన్నారు. టీడీపీ వారిపైనే అక్రమ కేసులు బనాయించారని, ఆ పార్టీ అధికార ప్రతినిధి పట్టాభిని అరెస్టు చేసి చట్ట విరుద్ధంగా ఎక్కడ ఉంచారో కూడా తెలియకుండా గుట్టుచప్పుడుగా కోర్టులో ప్రవేశపెట్టారన్నారు. మొత్తం ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏసీబీకి చిక్కిన వీఆర్‌ఓ

విశాలాంధ్ర-రాప్తాడు : రైతు నుంచి లంచం తీసుకుంటున్న వీఆర్‌ఓ అవినీతి నిరోధక శాఖ అధికారుల వలలో చిక్కాడు. ఏసీబీ అధికారులు వలపన్ని వీఆర్‌ఓ నుంచి డబ్బును స్వాధీనం చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ కంజాక్షన్ తెలిపిన వివరాల ప్రకారం, అనంతపురం జిల్లా రాప్తాడు మండలం జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన లక్ష్మిరెడ్డికి గాండ్లపర్తి గ్రామంలోని సర్వే నంబరు 14-7లో 5.50 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే అనారోగ్యంతో 11 జనవరి 2021న లక్ష్మిరెడ్డి అనారోగ్యంతో మరణించారు. ఇతనికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు యాలేటి ప్రదీప్ కుమార్ రెడ్డి ఉన్నారు. మృతి చెందిన లక్ష్మిరెడ్డి పేరు మీద ఉన్న ఆ భూమిని తన పేరుపై చేయించుకునేందుకు లక్ష్మీదేవి మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసింది. ఈ భూమికి సంబంధించి ఫారం-1బి, అడంగల్ జారీ చేసినా భూమికి సంబంధించిన పాసుపుస్తకం అందలేదన్నారు. లక్ష్మీదేవి గాండ్లపర్తి సచివాలయ కార్యాలయం ద్వారా పాస్ బుక్ రీప్లేస్‌మెంట్ కోసం ఈ ఏడాది జనవరి 18న దరఖాస్తు చేసుకుంది. దరఖాస్తుతో పాటు ఆ భూమికి సంబంధించిన అన్ని పత్రాలు అందజేసినా కూడా కారణం లేకుండా ఆమె దరఖాస్తును తిరస్కరించారు. ఈ విషయంపై రైతు లక్ష్మీదేవి కుమారుడు యాలేటి ప్రదీప్ కుమార్ రెడ్డి గాండ్లపర్తి వీఆర్‌ఓ నరసింహులును కలవగా రూ.4 వేలు లంచం డిమాండ్ చేశాడన్నారు. డబ్బు డిమాండ్ చేసిన విషయాన్ని ప్రదీప్ కుమార్ రెడ్డి అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ (స్పందన) నంబరు 14400 కు ఫిర్యాదు చేయగా ఏసీబీ కార్యాలయం సిబ్బంది తక్షణమే స్పందించారు. మంగళవారం నిందితుడు వీఆర్‌ఓ నరసింహులు ఫిర్యాదుదారుడు ప్రదీప్ కుమార్ రెడ్డి నుంచి రాప్తాడు మండలం జి.కొత్తపల్లి గ్రామంలో రూ.4 వేలు లంచం తీసుకుంటుండగా వలపన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ కంజాక్షన్ మాట్లాడుతూ ఎవరైనా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబరు 14400కు లేదా ఏసీబీ మొబైల్ యాప్‌లో గానీ ఫిర్యాదు చేస్తే తగిన న్యాయం చేస్తామని చెప్పారు. ఏసీబీ దాడిలో సీఐలు మోహన్ ప్రసాద్, శంకరరెడ్డి, శాంతి లాల్, శివగంగాధర్ రెడ్డి, ఎస్‌ఐలు హరినాథరెడ్డి, నరేంద్ర భూపతి, సిబ్బంది పాల్గొన్నారు.

కారకల్‌తో ఐకామ్ 'టెక్నాలజీ బదిలీ' ఒప్పందం

రక్షణ దళాలకు కారకల్ సాంకేతికతతో ఆయుధాల తయారీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారతదేశ రక్షణ అవసరాల చరిత్రలో మరో అధ్యాయం మొదలైంది. రక్షణ, సైనిక దళాలకు అవసరమైన అధునాతన ఆయుధాల తయారీ, సరఫరాలో ప్రపంచస్థాయి పేరు ప్రఖ్యాతులు గడించిన కారకల్ ఇంటర్నేషనల్ సంస్థతో హైదరాబాద్‌కు చెందిన ఐకామ్ సంస్థ సాంకేతికత బదిలీ ఒప్పందం కుదుర్చుకుంది. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ సంస్థ గ్రూప్ కంపెనీ అయిన ఐకామ్ సంస్థ భారతదేశ రక్షణ రంగానికి అవసరమైన ఆయుధాల తయారీలో భాగస్వామిగా ఉంటోంది. రక్షణ రంగ ఆయుధాల తయారీ భాగస్వామ్యంలో మొట్టమొదటిసారిగా టెక్నాలజీ బదిలీ కోసం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆధారిత ఈడీజీఈ భాగస్వామ్య సంస్థ కారకల్‌తో ఐకామ్ ఫిబ్రవరి 21న 'భాగస్వామ్యం - లైసెన్సింగ్' ఒప్పందంపై సంతకం చేసింది. 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' ప్రోత్సాహకాల్లో భాగంగా ఐకామ్ ఈ ఒప్పందం మేరకు హైదరాబాద్ శివారులోని తన యూనిట్‌లో కారకల్ టెక్నాలజీతో చిన్నపాటి ఆయుధాలను తయారు చేసి, భారతీయ మార్కెట్ అవసరాలకు సరఫరా చేస్తుంది. యూఏఈలోని అబుదాబిలో ప్రపంచంలోనే అతిపెద్ద ట్రై-సర్వీస్ డిఫెన్స్ ఎగ్జిబిషన్‌లలో ఒకటైన ఐడీఈఎక్స్ 2023లో ఈ మేరకు ఐకామ్- కారకల్ మధ్య ఒప్పంద సంతకాలు జరిగాయి. కారకల్ ఈఎఫ్ పిస్టల్, ఆధునిక సీఎంపీ 9 సబ్‌మెషిన్ గన్, సీఏఆర్ 814, సీఏఆర్ 816, సీఏఆర్ 817 టాక్టికల్ రైఫిల్స్, సీఏఆర్ 817 డీఎంఆర్ టాక్టికల్ స్నిపర్ రైఫిల్, కారకల్ సీఎస్ఆర్ 338, సీఎస్ఆర్ 308 బోల్ట్ యాక్షన్ స్నిపర్ రైఫిల్స్, సీఎస్‌ఏ 338 సెమీ ఆటోమేటిక్ స్నిపర్ రైఫిల్ ఆయుధాలన్నీ ఇకపై ఐకామ్‌లోనే తయారు కానున్నాయి. భారత రక్షణ రంగాన్ని స్వయం సమృద్ధి చేయడానికి, దేశ రక్షణ ఆశయాలకు సహాయం చేయడానికి కారకల్ టెక్నాలజీ ఒప్పందం ఎంతో దోహదపడుతుందని ఐకామ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.సుమంత్ పేర్కొన్నారు.

అబుదాబిలో ప్రధాన కార్యాలయాన్ని కలిగి ఉన్న కారకల్ ఆయుధ తయారీ సంస్థ పౌరులు, పోలీసులు, సైనిక అవసరాల కోసం వివిధ రకాల చిన్న ఆయుధాలను ఉత్పత్తి చేస్తోంది. భారతీయ మార్కెట్లో సహకారం కోసం ఐకామ్ ఈ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకున్నట్లు కారకల్ సీఈఓ హమద్ అల్ అమెరి అన్నారు. ఐకామ్ మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిల్) గ్రూప్ కంపెనీ. ఇది భారతదేశంలోని అతిపెద్ద మౌలిక సదుపాయాల కంపెనీలలో ఒకటి. 4.0 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ వార్షిక అమ్మకాలను కలిగి ఉంది.

అదానీ గ్రూప్‌పై మరో విమర్శ

(మొదటి పేజీ తరువాయి)

ముక్కుసూటిగా ఉండేవని వికీపీడియా తెలిపింది. 2012లో ముగ్గురు ఎడిటర్లు దానికి సంబంధించిన కంటెంట్‌లో మార్పులు చేశారని, వార్నింగ్ టెక్ట్సను సైతం తొలగించారని ఆరోపించింది. ఇలా 9 ఆర్టికల్స్‌ను రూపొందించిన/ సవరించిన 40 మంది పెయిడ్ ఎడిటర్లు, సాక్‌పప్పెట్స్‌ను బ్లాక్ చేసినట్లు వికీపీడియా తెలిపింది. ఇలా ఎడిట్ చేసిన వారిలో అదానీ గ్రూప్ కంపెనీ ఉద్యోగులూ ఉన్నారని పేర్కొంది. అదానీ గ్రూప్ ఐపీ అడ్రస్‌లు గుర్తించినట్లు తెలిపింది. "అదానీ గ్రూప్‌నకు చెందిన ఓ పెయిడ్ ఎడిటర్ ఆ కంపెనీకి సంబంధించి ఆర్టికల్‌నే పూర్తిగా మార్చివేశారు. ఇదంతా అదానీ గ్రూప్ ఐపీ అడ్రస్ నుంచే జరిగింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించిన హెచ్చరికలను కూడా తొలగించారు. వికీపీడియా క్వాలిటీ కంట్రోల్ సిస్టమ్స్‌కు సైతం దొరక్కుండా కొన్ని ఆర్టికల్స్‌ను రూపొందించారు" అని వికీపీడియా పేర్కొంది. ఈ ఆరోపణలపై అదానీ గ్రూప్ స్పందించలేదు.

మైనార్టీలకు తక్కువ బడ్జెట్ దుర్మార్గం: అజీజ్ పాషా

విశాలాంధ్ర-హైదరాబాద్ : ప్రజాస్వామ్యంలో మైనార్టీలు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నారని, దేశంలో వారి సంక్షేమానికి కేంద్ర బడ్జెట్‌లో తక్కువ కేటాయింపులు చేయడం దుర్మార్గం అని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ, ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షులు సయ్యిద్ అజీజ్ పాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి తక్కువ బడ్జెట్ కేటాయించడాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మంగళవారం ఇన్సాఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి అధ్వర్యంలో ధర్నా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అజీజ్ పాషా మాట్లాడుతూ మైనార్టీలు ఈ దేశంలో భాగమే అని, వారు ఈ దేశం కోసం, స్వేచ్ఛ కోసం అనేక త్యాగాలు చేశారని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే మైనార్టీల బడ్జెట్లో 38 శాతం కోత విధించిందని ఆరోపించారు. 'సబ్కా సాథ్ సబ్కా వికాస్' అనే మోదీ నినాదం ఇప్పుడు 'మైనారిటీస్ కా సత్యనాస్'గా కనబడుతుందని ఆయన మండిపడ్డారు.

నిర్వాసితులకు తీవ్ర అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని రామకృష్ణ వివరించారు. త్వరలో అసెంబ్లీ సమావేశాలు జరగనున్నందున నీటి పారుదల ప్రాజెక్టుల పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తామన్నారు. చిన్న ప్రాజెక్టులను సైతం పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నారని, ఆఫ్‌షోర్ శంకుస్థాపన చేసిన రోజున నాటి సీఎం రాజశేఖరరెడ్డి ఏడాదిలో అంటే 2009లో ప్రాజెక్టు పూర్తి చేసి నీరు అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ 15 సంవత్సరాలు దాటినా ఆ ప్రాజెక్టుకు అతీగతీ లేదని రామకృష్ణ విమర్శించారు. స్వల్పంగా ప్రాజెక్టు పనులు చేపట్టినా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదని, 3 కోట్ల రూపాయలు బకాయి ఉన్నట్లు ఓ సబ్‌కాంట్రాక్టరు చెప్పారన్నారు. బిల్లులు రాకపోవడంతో వర్మ అనే మరో కాంట్రాక్టరు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. పనులు చేసే వారికి డబ్బులు ఇవ్వకుండా, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించకుండా ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. పాలకులు వస్తున్నారు...పోతున్నారు గానీ సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. 15 సంవత్సరాలైనా అతి చిన్న ప్రాజెక్టు ఆఫ్‌షోర్ పూర్తికాకపోవడం సిగ్గుచేటన్నారు. అన్ని ప్రభుత్వాలు ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యం వహించాయని, అందుకే ఇరిగేషన్ ప్రాజెక్టుల సమస్యను ఒక ప్రధాన సమస్యగా సీపీఐ భావిస్తూ రాష్ట్రమంతా పర్యటిస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని రామకృష్ణ హామీ ఇచ్చారు. ఆఫ్‌షోర్ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు సీపీఐ అండగా ఉంటుందని, ఇందుకోసం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తిని కేటాయిస్తున్నామన్నారు. ఆయనకు తోడుగా సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరామ్మూర్తి, నాయకులు సుందరలాల్, రమణ పోరాడతారని చెప్పారు.

జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ నిర్వాసితుల కోసం సీపీఐ నిరంతరం పోరాడుతోందని చెప్పారు. బాధితులకు పునరావాసం, పరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభించాలని, కానీ ప్రభుత్వాలు భిన్నంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. వలస కార్మికుల పేర్లను పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. తాతతండ్రుల నుంచి వస్తున్న భూములు కోల్పోతున్న బాధితులకు అన్ని విధాలుగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం భూములు కోల్పోతున్న రేగులపాడు, చీపురుపల్లి నిర్వాసితులతో సమావేశమై వారి ఆవేదనను తెలుసుకున్నారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనుల జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి నిర్వాహకులు విజయకుమార్‌ను నష్టపరిహారం చెల్లించే వరకు పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, అక్కినేని వనజ, జి.ఈశ్వరయ్య, డేగా ప్రభాకర్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ పి.కామేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.విమలతో పాటు సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చాపర సుందరలాల్, జిల్లా నాయకులు చాపర వెంకటరమణ, పలాస నియోజకవర్గ కార్యదర్శి చాపర వేణుగోపాల్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షన్ముఖరావు, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యడ్ల మురళి, కె.శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సీహెచ్ రవి, సీపీఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యులు నిమ్మాడ కృష్ణమూర్తి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ సలహాదారులు చిక్కాల గోవిందరావు, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు పి.ప్రభావతి, అరేళ్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు

- దశాబ్దాలుగా రైతులు, ప్రజల ఎదురుచూపు
- తీరని నిర్వాసితుల సమస్యలు
- నేడు ప్రాజెక్టును సందర్శించనున్న సీపీఐ బృందం

విశాలాంధ్ర-విజయనగరం/గుర్ల: ఆ ప్రాజెక్టు పూర్తయితే తమ పంటలు పచ్చగా ఉంటాయని రెండు దశాబ్దాలుగా రైతులు ఎదురు చూస్తున్నారు. వేలాది మంది తాగునీటి సమస్య తీరుతుందన్న ఆశతో ప్రాజెక్టు త్వరగా పూర్తి కావాలని కోరుకుంటున్నారు. అయితే ప్రభుత్వాలు మారుతున్నాయేగానీ, హామీలు నెరవేరకుండానే కాలం గడిచిపోతోంది. ప్రాజెక్టు ఎప్పటికి పూర్తయ్యేనోగానీ, కనీసం తమ సమస్యలైనా పరిష్కరించమంటూ నిర్వాసితులు కోరుతున్నారు. ఇదీ విజయనగరం జిల్లా తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు దుస్థితి. విజయనగరం జిల్లా గుర్ల మండలం కోటగండ్రేడు వద్ద చంపావతి నదిపై ప్రాజెక్టును నిర్మించి, అక్కడ నుంచి కాలువ ద్వారా నీటిని కుమిలి వద్ద నిర్మించే రిజర్వాయర్‌లో నిల్వ చేయాలనే లక్ష్యంతో 2005లో రూ.181.50 కోట్ల అంచనా వ్యయంతో తారకరామ తీర్థసాగర్‌కు రూపకల్పన చేశారు. సుమారు 24,710 ఎకరాల ఆయకట్టుతో 8,172 ఎకరాల స్థిరీకరణ చేయాలనే సంకల్పంతో ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రాజెక్టు వల్ల డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ మండలాలకు చెందిన 49 గ్రామాలకు సాగు నీరు అందించనున్నారు. అలాగే విజయనగరం పట్టణానికి 0.162 టీఎంసీల తాగు నీరందించాలన్నది ప్రాజెక్టు లక్ష్యాల్లో ఒకటి. ప్రాజెక్టును 2008లో పూర్తి చేయవలసి ఉన్నప్పటికీ పూర్తికాలేదు. తరువాత 2010కి గడువు మార్చారు. 2014లో అంచనా వ్యయాన్ని రూ.475 కోట్లకు పెంచారు. తరువాత పనులు అరకొరగానే సాగడంతో రూ.740 కోట్లకు అంచనా వ్యయాన్ని పెంచారు. కానీ పరిస్థితిలో మార్పులేదు. తారకరామ ప్రాజెక్టు నిర్మాణంలో అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. సీతారామునిపేట సమీపంలోని కొండను తవ్వి టన్నెల్ ఏర్పాటు చేయవలసి వచ్చింది. దీనికి అటవీ శాఖ అనుమతులు తీసుకోవడం, భూ సేకరణ వంటి సమస్యలు ప్రాథమికంగా ఎదురయ్యాయి.

తీరని నిర్వాసితుల సమస్యలు

తారకరామకు నిధుల కొరతతో గత ఐదారేళ్లుగా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు కాలేదు. నెల్లిమర్ల మండలంలోని ఏటి అగ్రహారం, కోరాడపేట ముంపు గ్రామాలుగా ప్రకటించినప్పటికీ వారికోసం నిర్వాసిత గ్రామాలు ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. భూముల వరకు పరిహారం అందజేసినా రీసెటిల్మెంట్, రీహాబిలిటేషన్ నామమాత్రంగా మిగిలిపోయింది. ప్రాజెక్టు ప్రారంభ దశలో దన్నానపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కోరాడపేటను ముంపు గ్రామంగా ప్రకటించారు. తరువాత ఏటి అగ్రహారం కూడా ముంపు గ్రామంగా ప్రకటించారు. సారిపల్లి గ్రామం భూములు కూడా ప్రాజెక్టు పరిధిలోకి రావడంతో మూడు గ్రామాల వారికి 90 శాతం వరకు భూములకు నష్ట పరిహారం అందించారు. ముంపు గ్రామాల్లో పల్లానికి ఎకరానికి రూ.1.75 లక్షలు, మెట్ట భూమికి రూ.1.6 లక్షలు పరిహారంగా ఇచ్చారు. కోరాడ పేటలో సుమారు 200 ఎకరాలు, ఏటి అగ్రహారంలో 450 ఎకరాలు ముంపునకు గురవుతాయని గుర్తించారు. వీటికి సంబంధించి 90 శాతం పరిహారం ఇచ్చినా, గ్రామాల్లో నివాస గృహాలకు, పశువుల శాలలకు, ఫలసాయం ఇచ్చే చెట్లకు నష్ట పరిహారం ఇవ్వలేదు. వీటితో పాటు నిర్వాసిత కుటుంబాలకు జీవన భృతి కింద ఏడాదికి రూ.1.08 లక్షలు ప్రభుత్వం చెల్లించవలసి ఉంది. అలాగే 18 ఏళ్లు నిండిన యువకులకు ప్రత్యేక భృతి చెల్లించాల్సి ఉంది. ఆర్ అండ్ ఆర్ అమలు జరిగితే తమ సమస్యలు పరిష్కారమవుతాయని నిర్వాసితులు చెపుతున్నారు.

నేడు సీపీఐ బృందం పర్యటన

తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నేతృత్వంలోని బృందం బుధవారం సందర్శించనుంది. ప్రాజెక్టు తాజా పరిస్థితిని పరిశీలించనున్నారు.

ఏయూ వీసీ, కడప ఆర్జేడీపై చర్యలు తీసుకోవాలి

గవర్నరుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఆంధ్రా విశ్వవిద్యాలయం(ఏయూ) వైస్ చాన్సలర్ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి, కడప ఆర్జేడీ (పాఠశాల విద్య) ప్రతాపరెడ్డిలపై తగిన చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నరు ఎస్.అబ్దుల్ నజీర్‌కు ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రసాద్‌రెడ్డి, ప్రతాపరెడ్డి అధికార వైసీపీ అభ్యర్థులకు మద్దతుగా బహిరంగ సమావేశాల్ని నిర్వహిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, వైసీపీ తొత్తులా వ్యవహరిస్తున్న వీసీ ప్రసాద్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. విశాఖ దసపల్లా హోటల్‌లో వైసీపీ ఇన్‌చార్జ్ వైవీ సుబ్బారెడ్డి నేతృ త్వంలో ఆ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం నిర్వహించిన సమావేశంలో ప్రసాదరెడ్డి పాల్గొని ప్రచారం చేయడంపై అభ్యంతరం తెలిపారు. వీసీ ఆయన హోదాను ఆయన మరచి, అధికార పార్టీ సమావేశాలకు హాజర వ్వడం సరైనదికాదన్నారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం వీసీగా బాధ్యతలు చేపట్టి నాటి నుంచి ప్రసాద్‌రెడ్డి చాలా వివాదాస్పద నిర్ణయాలు చేస్తూ, నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తున్నారని వివరించారు. అధికార పక్షానికి అడుగడుగునా కొమ్ముకాస్తున్నారన్నారు. ప్రసాదరెడ్డి అక్రమాలు, ఆరో పణలపై గతంలోనూ గవర్నరుకు లేఖ రాసినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్‌గా ఉన్న ప్రతాప్‌రెడ్డిని రాయలసీమ పశ్చిమ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కడప ఆర్జేడీగా నియమించారన్నారు. రాయలసీమ పశ్చిమ ఉపాధ్యాయ, పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కడప ఆర్‌జెడి ప్రతాపరెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, వైసీపీకి కొమ్ముకాస్తున్నారని, కర్నూలు జిల్లా ఆదోనిలో 10వ తరగతి పరీక్షల అవగాహన సదస్సు పేరుతో అధికార వైసీపీ అనుకూల ఎమ్మెల్సీ అభ్యర్థి తరఫున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిం చారన్నారు. అనంతపురం, కడప జిల్లాలో కూడా ఆర్జేడీ అధికారులను వెంటేసుకుని ఎన్నికల ప్రచార సభలు నిర్వహించడం తీవ్ర ఆక్షేపణీ యమన్నారు. ఉపాధ్యాయేతరులను ఓటర్లుగా నమోదు చేసి, దొంగ ఓట్లను పెద్దఎత్తున చేర్చారని గుర్తుచేశారు. ఇటీవల కడపలో వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి గెలుపుకోసం ఓటర్లకు బహుమతులు పంపిణీ చేస్తున్న వైసీపీ శ్రేణులను సీపీఐ నాయకులు పట్టుకుని పోలీసులకు అప్పగించడం గమనార్హమన్నారు. రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమాలకు తావిస్తూ అధికార వైసీపీ అనుకూల అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహిస్తున్న ప్రసాదరెడ్డి, ప్రతాపరెడ్డిపై తగిన చర్యలు చేపట్టాలని ఆ లేఖలో రామకృష్ణ కోరారు.

17 నుంచి జార్ఖండ్‌లో ఇప్టా మహాసభలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజానాట్యమండలి (ఇప్టా) జాతీయ మహాసభలు జార్ఖండ్ రాష్ట్రం డెల్టాన్ గంజ్‌లో మార్చి 17 నుంచి 20వరకు జరగనున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పి.చంద్రానాయక్, చిన్నం పెంచలయ్య తెలిపారు. విజయవాడలోని దాసరిభవన్‌లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో కవులు కళాకారులపైన, ప్రశ్నించే వ్యక్తులపైన దాడులు జరుగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి పరిణామాలు సరికాదన్నారు. ఈ క్రమంలో జరుగుతున్న జాతీయ మహాసభలు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నాయని, కవులు కళాకారులు పాలకుల విధానాలపైన స్పందించాలన్నారు. నూతన కళా రూపాలు తయారుచేసి సమకాలిన సమస్యలపై ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఇప్టా కార్యదర్శి గని, ప్రజానాట్యమండలి నాయకులు ఆర్. పిచ్చయ్య, లక్ష్మణరావు, ఆర్.రామకృష్ణ, వి.నాగరాజు, మారెళ్ల శ్రీని వాసులు, ఆరే రామారావు, ఎస్.గుర్రప్ప, నజీర్, లంక దుర్గారావు పాల్గొన్నారు.

పన్నులపై పన్నులు

లక్ష్మీనారాయణ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పన్నులపై పన్నుల భారాలు మోపుతున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, పౌర సేవల గురించి పట్టించుకోవడం లేదని సామాజిక ఉద్యమకారుడు టి.లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పట్టణ పన్నుల వ్యవస్థలో, విద్యుత్ రంగంలో, వ్యాపారాన్ని సులభతరం చేయడానికి, ఒకే దేశం - ఒకే రేషన్ కార్డుకు ఆమోదం, ఈ నాలుగు సంస్కరణల అమలుకు రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణకు పూనుకుంటే ఎఫ్ఆర్‌బీయం గరిష్ట పరిమితికి మించి 2 శాతం అదనంగా అప్పులు తెచ్చుకోవడానికి అనుమతిస్తామని ప్రలోభపెడుతూ మోదీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల వెంటపడుతున్నదని పేర్కొన్నారు. అప్పుల కోసం అర్రులుచాస్తున్న జగన్ ప్రభుత్వం ఈ నాలుగు సంస్కరణల అమలుకు 'సై' అన్నదని విమర్శించారు. పట్టణాలు, నగరాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచే కార్యాచరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం ధ్యాస కనబరచడం లేదని, కానీ ఇంటి పన్ను(ఆస్తి పన్ను), ఖాళీ స్థలాలపై పన్ను, నీటి పన్ను, మురుగు పన్ను, చెత్త పన్ను పేర్లతో పన్నులు విధిస్తున్నదని మండిపడ్డారు. భవిష్యత్తులో 'ప్రీ పెయిడ్' విద్యుత్ మీటర్లు బిగించడానికి రంగం సిద్ధం చేస్తోందని తెలిపారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఒక్కొక్క ఇంటికి రెండు నెలలకు రు.360 చొప్పున మురుగు పన్ను ఉంటే 2020 ఏప్రిల్‌లో రు.1280కి, 2021 ఏప్రిల్‌లో రు.1728కి పెరిగిందని తెలిపారు. రేపో మాపో మళ్లీ పెంచేందుకు యత్నిస్తోందని వివరించారు. ఉదాహరణకు విజయవాడలో నూతనంగా ఓ అపార్టుమెంటు నిర్మించారు. అంతకుముందు ఆ స్థలంలో రెండు ఇళ్లు ఉండగా వాటికి రెండు ఇంటి నంబర్లతో వేరు వేరుగా మురుగు పన్ను బిల్లులు పంపారు. ఒక్కో ఇంటికి విధిస్తున్న మురుగు పన్నును పరిశీలిస్తే 2019 జూన్ నాటికి ఏడాదికి రు.2,160 ఉండేది. ప్రస్తుతం రు.10,368 వసూలు చేస్తున్నారు. అంటే ఒక్కొక్క ఇంటిపై ఏడాదికి మురుగు పన్నును రు.8,208 పెంచారని లక్ష్మీనారాయణ వివరించారు. ఆస్తి పన్నును రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా విధించడానికి నిర్ణయించారని, తాగు నీటి సరఫరాకు మీటర్లు బిగిస్తున్నారని, చెత్త పన్ను నెలకు రు.120 చొప్పున వసూలు చేస్తున్నారని తెలిపారు. పట్టణ స్థానిక సంస్థల్లో సంస్కరణలు అమలు చేస్తే రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో 0.5% అదనంగా అప్పు తెచ్చుకోవడానికి మోదీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు వెసులుబాటు కల్పించింది. దాని ప్రకారం రు.2,525 కోట్లు అదనంగా అప్పు తెచ్చుకోవడానికి జగన్ ప్రభుత్వానికి అనుమతిచ్చింది. విజయవాడ మురుగు కాలువల వ్యవస్థ ఆధునికీకరణకు కేంద్ర ప్రభుత్వం రు.500 కోట్ల ఆర్థిక సహాయం కూడా చేసిందని తెలిపారు.

మెడికల్ మాఫియా ఆగడాలు నియంత్రించాలి

పరుచూరి రాజేంద్రబాబు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో క్రమేపీ పెరిగిపోతున్న మెడికల్ మాఫియా (ప్రైవేట్ మెడికల్ షాపుల) ఆగడాలు నియంత్రించాలని, ప్రజల రక్తాన్ని మెడికల్ షాపు యజమానులు జలగలుగా తాగుతున్నప్పటికీ రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి అధికారులు మామూళ్ల మత్తులో మునిగిపోయారని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు విమర్శించారు. విజయవాడ హనుమాన్‌పేట దాసరి భవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, ప్రభుత్వ వైద్యులు, మెడికల్ షాపుల యాజమానులు సిండికేట్‌గా ఏర్పడి పెద్ద ఎత్తున నకిలీ మందులను, కాలం చెల్లిన మందులను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మందులను బయటి షాపుల్లో మాత్రమే కొనుగోలు చేయాలనే ఒత్తిళ్లు చేస్తున్నారన్నారు. పేదల అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకుని నాసిరకం, కాలం చెల్లిన మందులు విక్రయిస్తున్నారని, వివిధ రకాల పరీక్షల పేరుతో ల్యాబ్ యజమానులు పేదల రక్తాన్ని తాగుతుంటే ఔషధ నియంత్రణ మండలి, వైద్యారోగ్యశాఖాధికారులు చర్యలకు ఉపక్రమించకుండా మామూళ్ల మత్తులో మునిగిపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు, కరేటి రవీంద్ర పాల్గొన్నారు.

టీడీపీ నాయకులుపై కేసు నమోదు

విశాలాంధ్ర- గన్నవరం: కృష్ణాజిల్లా గన్నవరంలో సోమవారం వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య జరిగిన పరస్పర దాడుల నేపథ్యంలో సీఐ కనకారావు ఫిర్యాదు మేరకు గన్నవరం పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించి టీడీపీ నాయకులపై మంగళవారం కేసు నమోదు చేశారు. టీడీపీ కార్యకర్తలు రెచ్చగొట్టటం ద్వారా పట్టాభి సహా టీడీపీ నేతలు తనకు ప్రాణహాని కలిగించే ప్రయత్నం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏ-1 పట్టాభి, ఏ-2గా చిన్నా సహా మొత్తం 13 మందిపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. వైసీపీ శ్రేణులు సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేయటంతో పాటు ఆ పార్టీ నాయకులపై దాడి చేశారు. ఈ ఘటనలో టీడీపీ కార్యాలయం ధ్వంసమైంది. ఒక కారు దహనం, రెండు కారులు ధ్వంసం అయ్యాయి . దాడికి పాల్పడిన వైసీపీ నాయకులను వదిలి టీడీపీ నాయకులు 13మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పట్టాభిరామ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతు చిన్నతో పాటు 11మంది పై కేసు నమోదు చేశారు. వారిని మంగళవారం సాయంత్రం గన్నవరం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాలతో పట్టాభిరామ్‌ను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన 12 మందిని రిమాండ్‌కు తరలించారు. దాడి చేసిన వారిని వదిలి టీడీపీ నాయకులు పై కేసు నమోదు చేయడం పట్ల గన్నవరం ప్రజలు చర్చించుకుంటున్నారు.

థర్డ్ డిగ్రీ ప్రయోగించారు: పట్టాభి

తోటవల్లూరు పోలీస్‌స్టేషన్‌కు ముగ్గురు వ్యక్తులు ముసుగులో వచ్చి తనను అరగంట సేపు కొట్టారని కొమ్మారెడ్డి పట్టాభిరామ్ న్యాయమూర్తి ఎదుట వెల్లడించారు. తోట్లవల్లూరు పోలీస్ స్టేషన్‌లో తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని కోర్టులో న్యాయవాది, న్యాయమూర్తికి వివరించారు.

సుడిగుండంలో రాయలసీమ

విశాలాంధ్ర-ఆదోని రూరల్: రాయలసీమకు తాగు, సాగు కోసం నికర జలాలను అందివ్వకుండా, కేంద్ర ప్రభుత్వ వైఖరి కారణంగా కర్ణాటకలో అప్పర్ భద్ర డ్యాం నిర్మాణంతో రాయలసీమ ప్రాంతం సుడిగుండంలో ఇరుక్కుపోయిందని రాయలసీమ పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం కర్నూలు జిల్లా ఆదోనిలోని ఆర్సీసీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక ప్రాంతంలో అల్మటి వంటి చిన్నచిన్న ప్రాజెక్టులు అక్రమంగా నిర్మాణం చేయడం వల్ల ఇప్పటికే హక్కుల మేరకు నికర జలాలు అందక రాయలసీమ పూర్తిస్థాయిలో నష్ట పోయిందని, వెంటిలేటర్‌పై ఉన్న రాయలసీమను కాపాడుకోవడం మన బాధ్యత అని అన్నారు. తీగల వంతెన వద్దు... రోడ్ కమ్ బ్యారేజ్ నిర్మాణం చేస్తే 60 నుంచి 70 టీఎంసీల నీళ్లు నిలువ ఉంచుకునే సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.5,300 కోట్ల నిధులు కేటాయించి, శరవేగంగా నిర్మాణం చేపడుతుందని అన్నారు.

ముస్లింల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- ఇస్లామిక్ బ్యాంకులు ఏర్పాటు చేస్తాం
- బీడీ కార్మికులను ఆదుకుంటాం
- 'యువగళం' పాదయాత్రలో నారా లోకేశ్ హామీ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ముస్లింల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. 'యువగళం' పాదయాత్రలో భాగంగా 23వ రోజు మంగళవారం ఉదయం శ్రీకాళహస్తి పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద ముస్లింలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింల సమస్యలను ఆయన అడిగి తెలుసుకు న్నారు. ముస్లిం నేతలు, మహిళలు అడిగిన ప్రశ్నలకు సావధా నంగా సమాధానం ఇచ్చారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తా మన్నారు. ముస్లింలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ఇస్లామిక్ బ్యాంకులు ఏర్పాటు చేస్తామన్నారు. శ్రీకాళహస్తిలో బీడీ కార్మికులు పడుతున్న ఇబ్బందులను తాను స్వయంగా తెలుసు కున్నానని... వారిని ఆర్థికంగా ఆదుకోవడానికి, సంక్షేమ పథకాలు అందజేయడానికి తాము కట్టుబడి ఉంటామన్నారు. బీడీ కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్నారు. బీడీ కార్మికు లకు పింఛన్లు అందించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. దుల్హన్ పథకం తిరిగి ప్రారంభిస్తా మన్నారు. రంజాన్ తోఫాతో పాటు టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు అమలు చేసిన 15 పథకాలను ముస్లింలకు అందించేలా చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారు. తిరుపతి పార్లమెంటు పరిధిలో ముస్లిం పిల్లల కోసం ప్రత్యేకంగా గురుకుల ఉర్దూ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మసీదులు, షాదీఖానాల నిర్మాణం టీడీపీ హయాంలో మాత్రమే జరిగాయన్నారు. ఏపీలో ఉర్దూ యూనివర్సిటీ, ఉర్దూ టీచర్ల నియామకం కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కిందన్నారు. పార్లమెంటు యూనిట్‌గా చేసుకుని ముస్లింల కోసం మహిళా కళాశాల నిర్మిస్తామన్నారు. వైసీపీ పాలనలో ముస్లింలకు తీరని అన్యాయం జరుగుతోందని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ముస్లిం సంక్షేమానికి కట్టుబడి ఉంటుందన్నారు. ముస్లింలకు చట్ట సభల్లో ప్రత్యేక స్థానం కల్పిస్తున్న ఘనత కూడా టీడీపీదే అన్నారు. ఈ సాంప్రదాయం కొనసాగిస్తామన్నారు. అవసరమైతే కేంద్రంతో పోరాటానికి తమ ఎంపీలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఇప్పటికే సీఏఏ, ఎన్ఆర్సీ చట్టాల రద్దు కోసం టీడీపీ పోరాటం చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముస్లిం మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి షాకీర్ ఆలీ, తిరుపతి పార్లమెంటు ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షులు జలీల్ ఖాన్, పార్లమెంటు కార్యదర్శి జిలానీ బాషా, శ్రీకాళహస్తి పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి షఫీ, పట్టణ ప్రధాన కార్యదర్శి కరీం, మైనార్టీ సెల్ పార్లమెంటు కార్యదర్శులు మస్తాన్, ఖలీల్ బాషా, అస్మత్, మాజీ కౌన్సిలర్ బషీర్, పట్టణ టౌన్ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ ఖాదర్ బాషా, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సి.ఎస్.మస్తాన్, చాన్ బాషా, వి.ఎం.సి.మస్తాన్, బషీర్, సునీమా, మీర్జా తదితరులు పాల్గొన్నారు.

బుద్దా వెంకన్న నివాసం వద్ద ఉద్రిక్తత

అడ్డుకున్న పోలీసులు: వంశీ, నానిపై మండిపడ్డ వెంకన్న

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): టీడీపీ విజయవాడ నగర నేత బుద్దా వెంకన్న నివాసం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, మాజీ మంత్రి కొడాలి నానిపై తెలుగుదేశం మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మండిపడ్డారు. మంగళవారం గన్నవరం వెళ్లేందుకు బయలుదేరిన బుద్దా వెంకన్నను ఆయన ఇంటివద్ద వన్‌టౌన్ పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. రోడ్డుపై వెంకన్న బైఠాయించారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మీడియాతో మాట్లాడుతూ వంశీ, కొడాలి నాని తీరుపై ధ్వజమెత్తారు. పోలీసుల్లేకపోతే వైసీపీ నేతలు రాష్ట్రాన్ని వీడి వెళ్లిపోయేవారని అన్నారు. మేం కర్రలు జెండాల కోసం వాడుతున్నామని, వైసీపీ కార్యకర్తలు విధ్వంసానికి వాడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో దుర్మార్గ పాలన సాగుతోందని, తెలుగుదేశం పార్టీ కార్యాలయాలపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తు న్నామన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడుతున్న జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, ఈ రాష్ట్రంలో సైకో పాలనను త్వరలోనే అంతం చేస్తామని చెప్పారు. కర్రలు చేతిలో పట్టుకొని నిరసనన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు సాదరబోయిన ఏడుకొండలు, కామా దేవరాజు, కొట్టేటి హనుమంతరావు, ఉమ్మడి చంటి, తుపాకుల రమణమ్మ, బూదాల నందకుమారి, ప్రసన్నలక్ష్మి వల్లభనేని, పేరం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగును బతికించుకునే బాధ్యత యువతదే

విశాలాంధ్ర-విజయవాడ: తెలుగు భాషను బతికించుకునే బాధ్యత నేటి యువతపై ఉందని వక్తలు ఉద్ఘాటించారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య 20వ వార్షికోత్సవం, అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ సామల రమేష్ బాబు మాట్లాడుతూ... 'దేశంలో 2003 నుంచి మాతృ భాష కోసం పోరాడుతున్న మొదటి సమాఖ్య తెలుగు భాషోద్యమ సమాఖ్య అన్నారు. మాతృభాషోద్యమాన్ని యువత భుజస్కందాలపై ఉంచుతున్నా' మన్నారు. కార్యక్రమ ప్రధాన నిర్వాహకులు డాక్టర్ మొవ్వా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ... భావ వ్యక్తీకరణ కోసం భాష అవసరం అన్నారు. ప్రస్తుతం జన్యు సంబంధ భాషకు కష్టమొచ్చిందన్నారు. ఆంగ్లేయుల పాలన వల్లే ప్రపంచవ్యాప్తంగా మాతృభాషల మనుగడకు ముప్పు ప్రారంభమైందన్నారు. తెలుగు భాష మృతభాష కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పంజాబ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జోగా సింహ్ మాట్లాడుతూ... దేశంలో విద్య వ్యాపారమైందని ఆ వ్యాపారానికి ఆంగ్ల భాష ఊతమిస్తుందన్నారు. దురదృష్టవశాత్తు స్కూల్ భాష ఇప్పుడు ఇంటి భాషలా మరే పరిస్థితి ఏర్పడిందన్నారు. అనేక దేశాలు వారి మాతృభాషలోనే చదువుకునే అవకాశం కల్పిస్తున్నాయన్నారు. మాతృభాషని కాపాడుకోవలసిన బాధ్యత యువత పై ఉందన్నారు. ప్రాథమికంగా మాతృభాష నేర్చిన విద్యార్థికి ఇతర విదేశీ భాషలను నేర్చుకోవడం అత్యంత సులభమని యునెస్కో, ప్రపంచ వ్యాప్తంగా భారత్‌తో సహా 12 దేశాలలో చేపట్టిన అధ్యయనం స్పష్టం చేసిందన్నారు. ఆ విషయం పక్కన పెట్టిన పాలకులు ఇంగ్లీషు నేర్పడానికి కోట్ల రూపాయల నిధులు వెచ్చించడం హాస్యాస్పదమన్నారు. భాష కునారిల్లితే భవిష్యత్తులో ఆ ప్రాంత సంస్కృతి సంప్రదాయాలు అన్నీ కోల్పోవడం జరుగుతుందన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ మాట్లాడుతూ... భాషను బతికించుకోకపోతే జాతి మనుగడ ప్రశ్నార్థక మౌతుందన్నారు. ఇంజనీరింగ్ విద్య కూడా మాతృభాషలో నిర్వహించేలా జాతీయ విద్యావిధానం క్రింద అనువాద ప్రయత్నాలు మొదలవ్వడం సంతోషకరం అన్నారు. అయితే దాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు వద్దనడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. ఇంగ్లీషు మీడియం విద్యార్థికి కనీస జ్ఞానం ఉంటంలేదని, వారి పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారిందన్నారు. ఇంగ్లీష్ వల్లే వృద్ధి అనేది అపోహ మాత్రమే అన్నారు. స్కూల్ భాషలో బతికే విద్యార్థికి దురదృష్ట వశాత్తు ఇంటి భాష పరాయిభాష లా

భావించే పరిస్థితి నెలకొందన్నారు. ఆంధ్ర లయోలా కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్ మాట్లాడుతూ... వెయ్యేళ్ల క్రితం వరకూ ప్రపంచంలో పదివేల భాషలున్నాయన్న అంచనాలుంటే ప్రస్తుతం వాటి సంఖ్య 6500 వరకూ పడిపోయిందని తెలిపారు. 2050 నాటికి 500కి, మరో 20 ఏళ్ళకు 300 లకు పడిపోవచ్చని భాషా శాస్త్రవేత్తలు అంచనా వేశారన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు వక్తలు సమాధానమిచ్చారు. తదుపరి జరిగిన తెలుగు భాషోద్యమ సమాఖ్య సర్వ సభ్య సమావేశంలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, డాక్టర్ సామల రమేష్ బాబు, డాక్టర్ గారపాటి ఉమామహేశ్వరరావు, డాక్టర్ జోగా సింహ్, మాజీ ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు, సమాఖ్య కార్యదర్శి డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు, డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్, వీవెన్, రహ్మానుద్దీన్ షేక్ తదితరులు సమాఖ్య గత ఇరవై ఏళ్లలో చేసిన ఉద్యమాలు, వాటి ఫలితాలు...తదుపరి కార్యాచరణ పై చర్చించారు. ఈ సందర్భంగా 'అమ్మనుడి' మాస పత్రిక సంపాదకీయాలతో ముద్రితమైన పుస్తకాన్ని మండలి బుద్ధ ప్రసాద్ ఆవిష్కరించారు. రచయిత అద్దంకి శ్రీనివాస్ రాసి, వనజ పాడిన తెలుగు పోరాట పాటను ఈ సందర్భంగా విడుదల చేశారు. సమావేశం ఏకగ్రీవంగా ఈ క్రింది తీర్మానాలను సమావేశం ఆమోదించింది.

- శాస్త్రీయత, విద్యావిజ్ఞానాల వ్యాప్తి, సమాజ పురోగతి అనే మూడు సూత్రాల ఆధారంగా భాషా విధానాన్ని రూపొందించాలి.
- తెలుగు జాతి అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తున్న రెండు తెలుగురాష్ట్ర ప్రభుత్వాల తీరుని నిరసిస్తూ కార్యాచరణకు తెలుగు సంవత్సరాది నుంచి ఉద్యమం.
- తెలుగు ప్రాధికార సంస్థ సాధనకై మరోసారి ఉద్యమ కార్యాచరణ చేపట్టాలి.
- భాషాభివృద్ధి, నాణ్యమైన మాతృ భాషా విద్యా బోధనకై న్యాయస్థానాలతో సహా క్రియాశీలురైన ప్రజలు చేస్తున్న పోరాటాలను బలపరచి, ప్రజాస్వామ్య పద్ధతిలో వివిధ ఉద్యమాలను చేపట్టేందుకు నిర్ణయం.
- మాతృభాషలకు పొంచి వున్న ముప్పును ఎదుర్కోడానికి అవసరమైన రాజ్యాంగ సవరణలకై కార్యాచరణ.
- సంస్థాపరంగా తెలుగు భాషోద్యమ సమాఖ్య సాంకేతిక రంగంలో తీసుకోబోయే చొరవలపై తీర్మానం. తెలుగును మరింత మెరుగ్గా నేర్చుకునేందుకు కావాల్సిన మొబైల్ యాప్ లను, కోర్సులు, ఇతర వనరులను ఒక సంకలనంగా 'అమ్మనుడి' వలగూడు (వెబ్ సైట్) ద్వారా అందుబాటులోకి తేవడం. భాషా పరిరక్షణకు పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో ఆన్‌లైన్ ఉద్యమానికి ఊతమివ్వడం. భాష గొప్పదనాన్ని తెలిపే వ్యాసాలకు, డాక్యుమెంటరీలకు, లఘు చిత్రాలకు చేయూతనివ్వడం.

సంపాదకీయం

పారదర్శకతలేని దెవరికి?

బీజేపీ నాయకత్వంలో నరేంద్రమోదీ అధికారం చేపట్టే సమయంలో పారదర్శకత, జవాబుదారీ పాలన అందిస్తానని దేశ ప్రజలకు వాగ్దానం చేశారు. తొమ్మిదేళ్ల పాలనాకాలంలో చేసిన వాగ్దానాలను అనేకసార్లు ఉల్లంఘించారు. బహుశా పారదర్శకత అనేది మోదీ డిక్షనరీలో లేదని భావించ వలసివస్తుంది. రాజ్యాంగ వ్యవస్థలన్నీ మోదీ కనుసన్నల్లోనే పనిచేస్తున్నాయి. న్యాయవ్యవస్థసైతం ప్రభుత్వం చెప్పినట్లు వినవలసిందేనని ఒత్తిడి చేయడం ఇటీవల కాలంలో ఎక్కువైంది. మోదీకి అత్యంత సన్నిహితంగా ఉండే అదానీ గ్రూపు స్టాక్‌మార్కెట్‌లో తీవ్ర కుంభకోణానికి పాల్పడిందని అమెరికా ఆర్థిక పరిశోధనా సంస్థ హిండెన్‌బర్గ్ నివేదిక వెల్లడించడంతో దేశ ప్రజలు విభ్రాంతిచెందారు. కుంభకోణాల తర్వాత అదాని ప్రపంచ కుబేరుల్లో రెండవస్థాయి నుంచి 25వ స్థానానికి పడిపోయిందని తాజా అంచనా. షేర్లకొనుగోలు దారులు లక్షల కోట్లు నష్టపోయారు. ఈ 'అదానీ గేట్' పై పార్లమెంటరీ కమిటీద్వారా దర్యాప్తుకు ప్రతిపక్షాలు చేసిన డిమాండ్‌ను ప్రభుత్వం తిరస్కరించింది. అనంతరం అదానీ మోసాలపై దర్యాప్తు చేయించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు కోరగా కమిటీని తామే నిర్ణయించి పేర్లను సీల్డు కవరులో సుప్రీంకు అందచేస్తామని ప్రభుత్వం తెలిపింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్‌రిజిజు సుప్రీంకోర్టుకు పారదర్శకత, న్యాయ జవాబుదారీతనం లేదని తీవ్రంగా దాడి చేశారు. ప్రజాజీవనంలో గల పారదర్శకత, నిజాయితీ సుప్రీంలో లోపించాయని పరిధినిమించి వ్యాఖ్యానిం చారు. మంత్రి ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడినప్పటికీ చాలా ప్రశాంతంగా ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ ప్రభుత్వం మళ్లీ మాట్లాడేందుకు వీలులేని విధంగా తగిన సమాధానం చెప్పారు. సీల్డు కవరు సంస్కృతిని తిరస్కరిస్తూ తామే దర్యాప్తు ప్యానెల్‌ను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. పారదర్శకత మోదీ పాలనలో మచ్చుకైనా కనిపిస్తుందా? అయినప్పటికీ సుప్రీంకోర్టుపై తీవ్రంగా ధ్వజమెత్తడం ద్వారా న్యాయవ్యవస్థను కించపరచడం రిజిజుకి అలవాటుగా మారింది. సీల్డు కవరు అంటే అందులో ఏముందో పిటిషన్ల దాఖలు చేసినవారికి ఏ విషయం తెలియకుండా చేయడమే.

ప్రభుత్వం నియమించిన కమిటీ సీల్డు కవరును తీసుకొని దాన్ని సుప్రీంకోర్టు పరిశీలించి అది తమ నిర్ణయంగా ప్రకటిస్తే పారదర్శకత ఉండదని, ప్రజల్లో విశ్వాసం ఉండదని చంద్రచూడ్ తగురీతిలో చురకలంటించారు. కోర్టు సమాధానం ప్రభుత్వానికి చెంపపెట్టు అయింది. మంత్రి రిజిజు గతంలోనూ ఇలాగే కోర్టును అవమా నించేరీతిలో మాట్లాడారు. జడ్జిలు ఎన్నికల్లో పాల్గొనరని, ప్రజలు పరిశీలించి ఒక నిర్ణయానికి వచ్చేఅవకాశం ఉందని వ్యాఖ్యా నించారు. కార్యనిర్వాహక వర్గం, న్యాయవ్యవస్థ స్వతంత్రంగా పనిచేస్తాయన్న స్పృహకూడా మంత్రికి లేదని అనుకోవలసివస్తుంది. న్యాయమూర్తుల తీర్పులనుచూసి వారి పనితీరును అంచనా వేస్తారని రిజిజు మాట్లాడి కోర్టును అవమానపరిచారు. ఒక వ్యవస్థ మరో వ్యవస్థలో చొరబడకూడదని రాజ్యాంగం నిర్దేశించింది. అయితే ప్రభుత్వం చేసే తప్పులను న్యాయస్థానాలు ఎత్తిచూపి సరిదిద్దు కోవాలని చెప్పకపోతే ప్రజలకు న్యాయం జరిగేదెలా?

గతంలోనూ సీల్డుకవర్ల సంస్కృతి ఉన్నప్పటికీ ఇలాంటి సందర్భాలు అరుదుగానే ఉన్నాయి. వేళ్ల మీద లెక్కించగలిగినన్ని ఘటనలే ఉన్నాయి. అయితే నరేంద్ర మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇలాంటి ఘటనలు చాలా తరచుగా జరుగుతున్నాయి. గతంలో కొందరు న్యాయమూర్తులు ఈ పద్ధతిని అనుమతించారు. వారు ఈ పద్ధతిని ప్రోత్సహించకపోయిఉంటే మోదీ ప్రభుత్వం ఈ దుస్సాహసానికి పూనుకొని ఉండదు. పైగా ఈ ప్రభుత్వం సుప్రీంకోర్టు తన చేతిపనిముట్టుగా చేసుకోవాలన్న ప్రయత్నం చేస్తోంది. దర్యాప్తుసంస్థలు, నియంత్రణ సంస్థల సహాయం తీసుకొనేలాగా దర్యాప్తు కమిటీని నియమిస్తామని ధర్మాసనం చెప్పిన తర్వాతకూడా తాము సూచించిన సభ్యుడొకరిని తీసుకోవాలని కూడా ప్రభుత్వం కోరడం మోదీ ప్రభుత్వ వింతవైఖరికి తార్కాణం. ధర్మాసనం పనితీరును తెలుసుకున్న తర్వాత ప్రభుత్వం తరఫున సభ్యుడిని కమిటీలోకి తీసుకోవలసిందిగా తాను కోరబోనని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్తూ ప్రభుత్వం ఇందులో ఏదీ దాచబోదన్నారు. అదానీ కుంభకోణం జరిగిన నాటి నుండి ఈ కుబేరుడి మోసాలు బైటపడకుండా చూసేందుకు ప్రభుత్వం అనేక రకాలుగా ప్రయత్నించింది. అదానీని కాపాడటం ద్వారా షేర్లు కొని పెట్టుబడులు పెట్టిన ఎల్‌ఐసీ, ప్రభుత్వ బ్యాంకులను నష్టపరిచింది. లక్షలాది ప్రజలను మోసగించింది. అంతర్జా తీయంగా ప్రతిష్ఠ కోల్పోయింది. స్టాక్‌మార్కెట్ ఏ విధంగా నష్టపోలేదని నియంత్రణ సెబీ కూడా అదానీని వెనకేసుకు రావడం ఏమిటి? ఇప్పటికీ అదానీ గ్రూపు షేర్లు ఇంకా పతనమవుతూనే ఉన్నాయి. తప్పు ఎవరిదని ప్రజలు తెలుసుకొనే హక్కును సైతం ప్రభుత్వం తిరస్కరిస్తోంది. రాఫెల్ విమానాల కొనుగోలులో ప్రభుత్వం ఇసుమంతకూడా పారదర్శ కతను ప్రదర్శించలేదని ప్రజలం దరికీ తెలుసు. యూపీఏ ప్రభుత్వకాలంలో విమానాలను తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ దాన్ని తోసివేసి ఈ ప్రభుత్వం ఎక్కువ ధరకు కొనుగోలు చేయడం ప్రజాధనాన్ని దుర్వినియోగ పరచింది. ఇక ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టి ఎంతమాత్రం పారదర్శకంగా లేదు. ఇలా కొనుగోలుచేసే బాండ్లు నల్లధనాన్ని ప్రోత్సహించడం కాదా? వేలకోట్లుపెట్టి కార్పొరేట్లు బడా వాణిజ్యవేత్తలు నల్లధనంతోనే కొనుగోలు చేస్తారు. ఈ డబ్బు లెక్కల్లోకి రాదుగనుక అదినల్లధనమే అవుతుంది. మోదీ నల్లధనం నిర్మూలిస్తానన్న వాగ్దానం ఏమైంది? ఇప్పటికైనా ప్రభుత్వం తనవైఖరిని మార్చుకోవాలి.

బడా కంపెనీలకు నిధులిచ్చినా ఉద్యోగాలు కరువే

డాక్టర్ సోమ మర్ల

బడ్జెట్‌లో పెద్దపెద్ద కంపెనీలకు నిధులు ఎక్కువగా కేటాయించినప్పటికీ ఉద్యోగాలు సృష్టించడంలో అది విఫలమవుతున్నాయి. ఈ ఏడాది కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 2023-24కుగాను పదిలక్షల కోట్లు పెట్టుబడి వ్యయం కింద కేటాయించారు. అయితే ఇందులో నాలుగోవంతు నిధులను కొత్త రోడ్లు, జాతీయ రహదారుల నిర్మాణానికి, మరో పావువంతు వేగంగా నడిచే కొత్త రైళ్లు(వందే భారత్) ప్రవేశపెట్టడం కోసం కొత్త లైన్ల నిర్మాణానికి ఖర్చు చేస్తారు. మౌలిక సదుపాయాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వాలకు పదిశాతం రుణాలుగా అందచేస్తారు. మౌలిక సదుపాయాల నిర్మాణానికి బడ్జెట్ కేటాయింపులు జీడీపీలో దాదాపు 3శాతం ఉంటాయి. భారీగా నిధులు ఖర్చు చేసినప్పటికీ, ఆర్థికరంగం పుంజుకోకపోవచ్చు. అలాగే కొత్త ఉద్యోగాల సృష్టి ఉండదు. ఆర్థికమంత్రి మాత్రం డిమాండ్‌ను పెంచడంకోసం నిధులు కేటాయించామని చెబుతున్నప్పటికీ అవి కుబేరులకు నయాఉదారవాద ఆర్థిక బహుమతి అవుతాయి. సంప్రదాయ ఆర్థికరంగంలో మౌలికసదుపాయాలపై ఖర్చుచేసి పెట్టుబడులు పెట్టడానికి ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతుంటారు. దీనివల్ల బొగ్గు, సిమెంటు, స్టీలు, భారీయంత్రాలు, అనేక ఉద్యోగాల సృష్టి జరిగి ప్రత్యక్షంగా పరోక్షంగా పేదలకు ఆదాయం పెరుగుతుంది. ప్రపంచబ్యాంకు అధ్యయనం ప్రకారం(ఆగస్టీ కౌమి-నవంబరు 22) ప్రకారం, రోడ్ల నిర్మాణానికి ఖర్చుచేసే ప్రతి రూపాయి అదనంగా ఏడు రూపాయల విలువ ఉంటుంది. బ్యాంకు ఇచ్చిన నివేదికలోనే ఇదే సమయంలో భారతదేశం రానున్న పదిహేనేళ్లల్లో ప్రతి సంవత్సరం 840 బిలియన్ డాలర్లు ఖర్చు చేయవలసి ఉంది. ఏడాదికి పట్టణప్రాంతంలో మౌలిక సదుపాయాల నిర్మాణానికి సగటున 55 బిలియన్ డాలర్లు ఖర్చు చేయవలసి ఉంటుంది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు అంటే ఉదాహరణకు రోడ్లు, జాతీయ రహదారుల నిర్మాణం ద్వారా ఖనిజాలు, వస్తువులు, రవాణా చేసేందుకు దోహదపడుతున్నది. ఫలితంగా వినిమయ డిమాండు ఏర్పడుతుంది. అలాగే ఉత్పత్తిశక్తిని పెంపొందించేందుకు పరిశ్రమలు, పెట్టుబడులను పెంచేందుకు వీలుకలుగుతుంది. అయితే ప్రైవేటు పరిశ్రమలు పెట్టుబడులు పెట్టడం ద్వారా హామీఇచ్చిన ప్రయోజనాలు పేదలకు అందించడానికి ముందుకు రావడంలేదు. ఈ అంశాన్ని లోతుగా పరిశీలించాలి.

భారీ బడ్జెట్ కేటాయింపులు, ప్రైవేటు పరిశ్రమలు పెట్టుబడి అధికంగా వ్యయం చేస్తాయని ఉదారంగా పన్నుల రాయితీలు ఇచ్చారు. అయితే ఈ పరిశ్రమలు పెట్టుబడులు పెట్టడంలో విఫలం కావడంతో ఆర్థికరంగం పుంజుకోవడం ప్రారంభంకాలేదు. రెండేళ్లక్రితం రెండులక్షల కోట్ల రూపాయలు మౌలిక సదుపాయాల కల్పనద్వారా లభిస్తాయని ఆర్భాటంగా ప్రకటించినప్పటికీ ప్రైవేటు పెట్టుబడులు ఏ మాత్రం చెప్పుకోదగినవిగాలేవు. ఈ విధానం దేశ జీడీపీ వృద్ధిరేటు పెంచడంలో విఫలమైంది. ఇటీవల విడుదలచేసిన ఆర్థికసర్వే ప్రకారం అంచనా వేసిన ఫలితాలు రాలేదు. నిరాశే మిగిలింది. ఇందుకు ప్రధాన కారణం వస్తువులు కొనుగోలుకు ప్రజల దగ్గర డబ్బులు లేకపోవడమే. ఇప్పటికీ వినిమయ డిమాండ్ తక్కువగా ఉన్నది. ఉపాధి కల్పనకు(జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం), ఆహారభద్రత, ఆరోగ్యరంగం, శిశు మహిళా సంక్షేమం కార్యక్రమాలకు అతి తక్కువ నిధులు కేటాయించారు. చిన్నపరిశ్రమలకు ప్రోత్సాహకాలను విస్మరించారు. ఫలితంగా ప్రజల వస్తువులు కొనుగోళ్లు చేయడం తగ్గిపోయింది. విలాసవంతమైన కార్లు, నివాసానికి విల్లాలు కొనడం బాగా పెరిగింది. ఫలితంగా సంపన్నులు, పేదల మధ్య అపారంగా అసమానతలు పెరుగుతున్నాయి. వినిమయ డిమాండ్ లేకపోవడంతో ప్రైవేటు పరిశ్రమలు అదనంగా పెట్టుబడులుపెట్టి తమ ఉత్పత్తి శక్తిని పెంచుకోవాలన్న ఆసక్తి చూపడంలేదు. కేంద్ర ప్రభుత్వం అనేక పన్నులను తగ్గించడం లేదా పెట్టుబడులకు నిధులను సమకూర్చడం చేస్తున్నప్పటికీ ప్రైవేటు పరిశ్రమల పెట్టుబడులు పెరగడంలేదు. అలాగే స్థూల పెట్టుబడి నిల్వలు పెరగడంలేదు. ద్రవ్య కార్యకలాపాలను జీడీపీ స్థూల నిర్దిష్ట పెట్టుబడుల నిల్వల మధ్య నిష్పత్తి సూచిక అవుతుంది. ఈ నిష్పత్తి 2014-15లో 33శాతం ఉండగా, అది 2022-23 నాటికి 29శాతానికి పడిపోయింది. ఈ కాలంలో కేంద్రం(తరువాత వార్షిక బడ్జెట్‌లలో) ఖర్చుచేసిన పెట్టుబడి వ్యయం జీడీపీలో నిలకడగా 1.7శాతం నుంచి 2.7శాతానికి పెరిగింది. అంటే దీని అర్థం మౌలిక సదుపాయాలకు ప్రభుత్వ వ్యయం తగినంత లేదు. మొత్తం మీద జీడీపీ రేట్లు కూడా క్షీణిస్తూనే ఉంది. అంటే పెట్టుబడుల రేటు కంటే ప్రైవేటు పెట్టు బడులు వేగంగా తగ్గిపోతున్నాయి. (ఆర్థికసర్వే 2020-23). మౌలిక సదుపాయాలకోసం ఖర్చు పెంచుతున్నప్పటికీ సానుకూల ప్రభావం చూపడంలేదు.

నాలుగురోజుల క్రితం 12 బిలియన్ల విలువగల ముంబై-దిల్లీ జాతీయ రహదారి మొదటిదశను ప్రధాని మోదీ ప్రారంభించారు. 1900 సంవత్సరాలలో అమెరికాలో ఆటోమొబైల్ ఉత్పత్తిని పెంచడంకోసం దేశం నలుమూలలా జాతీయ రహదారులను నిర్మించింది. అప్పుడు రైల్వేలైనులు, ప్రజారవాణా తగ్గిపోయాయి. దీనితో లక్షలాది అడవులు, జంతుజాలాలు, పక్షులు, ఫల,పుష్పాల వాతావరణం హరించుకుపోయింది. జాతీయ రహదారులు, ఇతర పరిశ్రమలు, నిర్మించినట్లయితే కొత్తగా ఉద్యోగాలు లభిస్తాయని ప్రధాన ఆర్థిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 2016-17, 2021-22 సంవత్సరాలలో సిమెంటు పరిశ్రమలో 62శాతం ఉద్యోగాలు తగ్గిపోయాయి. అలాగే స్టీలు పరిశ్రమలో 28శాతం ఉద్యోగాలు తగ్గాయి. గనుల తవ్వకంలోనూ ఇదే పరిస్థితి. ఆధునిక యంత్రాల ఉత్పత్తిలోనూ, ఉద్యోగాలపై కోతపడుతోంది. పరిశ్రమల్లో ఉత్పత్తి శక్తిని విస్తరించాలన్న అభిలాషలేకపోవడం ఇందుకు ప్రధానకారణం. రోడ్ల నిర్మాణం విషయంలోనూ ఉపాధికల్పనకు ఇదే పరిస్థితి. ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు కేటాయింపులు పెంచినట్లయితే ఉద్యోగాలు పెరుగుతాయి. అలాగే ఆరోగ్యం, విద్య, మహిళ,శిశు వులకు పౌష్టికాహారం అందించడానికి మురికివాడల్లో ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాలను విస్తరించడానికి ఎక్కువగా నిధులను కేటాయించాలి. దీనివల్ల మానవాభివృద్ధి లక్ష్యాల సాధనకు, జీడీపీ పెరుగుదలకు అవకాశం కలుగుతుంది. ఆయా ప్రభుత్వాలు నయా ఉదారవాద ఆర్థిక విధానాన్ని పాటిస్తూ ప్రజాప్రయోజనంకల కార్యక్రమాలకు నిధులు కేటాయించకపోవడం ప్రధానకారణం. ప్రపంచబ్యాంకు నయాఉదారవాద, సామ్రాజ్యవాదుల ఆదేశాలను తప్పనిసరిగా ఆమోదిస్తూ ఈ ఆర్థిక విధానాన్ని ప్రభుత్వాలు రూపొందిస్తున్నాయి. గత మూడు దశాబ్దాలుగా భారతదేశంలో నయాఉదారవాద విధానాలనే అనుసరిస్తున్నారు. భారత ఆశ్రిత పెట్టుబడిదారులకు, విదేశీ పెట్టుబడిదారులకు భారీగా నిధులు కేటాయిస్తూ కోట్లాదిమంది పేదలను తీవ్రమైన పేదరికంలో ఉంచుతున్నారు.

ఆలోచన నైపుణ్యాలను హరిస్తున్న ఛాట్ జిపిటీ !

మైక్రోసాఫ్ట్ నవంబర్-2022లో ప్రవేశపెట్టిన "ఛాట్ జిపిటీ (ఛాట్ జనరేటెడ్ ప్రీ-ట్రెయిన్డ్ ట్రాన్స్‌ఫార్మర్)" యాప్ "టాక్ ఆఫ్ ది టౌన్" అవుతున్నది. ప్రవేశపెట్టిన తొలి ఐదురోజుల్లోనే ఛాట్ జిపిటీ యాప్ వినియోగదారులు ఒక మిలియన్‌కు చేరుకున్నారు. విద్యావేత్తలు ఇలాంటి కృత్రిమ మేధ, ఏఐ ఆధారిత యాప్‌పై తీవ్ర ఆందోళనలు వ్యక్తంచేస్తున్నారు. ఈ మోడల్ ప్రస్తుత విద్యా వ్యవస్థను, గూగుల్ సర్చ్ యాప్ వ్యాపారాన్ని నిర్వీర్యం చేయవచ్చని వాపోతున్నారు. మన విద్యార్థుల్లో ఆలోచనాశక్తి, సమస్యల పరిష్కార నైపుణ్యాలపై ముప్పేటదాడిగా ఉందని హెచ్చరిస్తున్నారు. గతంలో గణితపాఠాలు బోధించే ఉపాధ్యాయులు 1 నుంచి 20 టేబుల్స్ కంఠస్థం చేయడానికి విద్యార్థులను ప్రోత్సహించడం, నేర్చుకున్న పిల్లలు సగర్వంగా ఫీల్‌కావడం మనకు అనుభవం. తరువాత కాలిక్యులేటర్ కనిపెట్టడంతో పిల్లల్లో గణిత టేబుల్స్ నేర్చుకోవలసిన అవసరం తగ్గిపోయింది. శాస్త్రసాంకేతిక వృద్ధితోపాటు విద్యార్థులకు పరీక్షల నిర్వహణ పద్ధతుల్లోకూడా మార్పులు వచ్చాయి. అనంతరం అంతర్జాల సహాయంతో గూగుల్ సర్చ్ విప్లవం కాలిక్యులేటర్‌ను పక్కకుతోస్తూ ఉప్పెనలా మన ముందుకు వచ్చింది. గూగుల్‌సర్చ్ రావడంలో యువతలో చదవడం, నేర్చుకోవడం అనే అలవాటు తప్పిపోతున్నది. గూగులమ్మ ఒడిలో చేరిన యువత పుణ్యాన ప్రపంచవ్యాప్తంగా పుస్తకాలషాపుల్లో గిరాకీ తగ్గడం, బుక్‌స్టోర్స్ మూతపడడం చూసాం. ఇంటర్నెట్ విప్లవంతో సమాజంలో చదవడానికి నూతన గూగులమ్మ తలుపులు తెరుచుకున్నాయి. ప్రతిచిన్న విషయ పరిజ్ఞానానికి స్మార్ట్‌ఫోన్ సహాయంతో గూగుల్‌సైట్ తెరవడం చిన్న పిల్లలకు కూడా అలవాటైంది.

యూయస్ మెడికల్ లైసెన్సింగ్ పరీక్ష నెగ్గిన ఛాట్ జిపిటీ:

యునైటెడ్ స్టేట్స్ మెడికల్ లైసెన్సింగ్ ఎగ్జామ్(యూయస్‌యంయల్‌ఈ) నిర్వహించిన పరీక్షలో ఛాట్ జిపిటీ యాప్ 60 శాతానికి పైగా మార్కులతో నెగ్గడం(52.4 శాతం నుంచి 75.0 శాతం) ఆశ్చర్యంగా ఉందని నిపుణులు తెలుపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే పరీక్షల్లో అత్యంత కఠిన, ప్రమాణాలతో కూడిన పరీక్షగా యూయస్‌యంయల్‌ఈకి పేరుంది. ఈ పరీక్షలో స్టెప్-1, 2సికె, 3 లాంటి దశలు ఉంటాయి. ఈ పరీక్షలో నెగ్గినవారికి మాత్రమే అమెరికాలో మెడికల్ లైసెన్సులు ఇస్తారు. మెడికల్ విద్యార్థులు, ఫిజీషియన్ల విషయ పరిజ్ఞానాన్ని (బయోకెమిస్ట్రీ, డయగ్నొసిస్, బయోఎథిక్స్ లాంటి మెడికల్ రంగాల్లో) తెలుసుకోవడానికి ఈ పరీక్షలు ఉపయోగపడుతున్నాయి.

విద్యార్థుల్లో గూగుల్‌సర్చ్‌తో కాపీ, పేస్ట్ కల్చర్ విపరీతంగా పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో విద్యార్థుల పరీక్ష విధానాల్లో మార్పులు అనివార్యం అయ్యాయి. ఆన్‌లైన్ పరీక్షలతో సంప్రదాయకంగా రాసే కళ అడుగంటింది. ప్రశ్నాపత్రంలో ఇవ్వబడిన పేరాను చదివి దానిలో దాగిన సమాధానాలను వెతికి రాయమని అంటున్నారు. ఈ విచిత్ర సంధి కాలంలో నేడు "ఛాట్ జిపిటీ" యుగం వేగంగా దూసుకువచ్చింది. 'కృత్రిమ మేధ' ఆధారిత 'ఛాట్ జిపిటీ' ద్వారా మానవ స్పందనల వలె సమాధానాలు క్షణాల్లో వస్తున్నాయి. సంక్లిష్ట ప్రశ్నలకు సహితం క్షణాల్లో సరైన సమాధానాల స్పందనలు కనబడుతున్నాయి. గూగుల్‌సర్చ్‌తో వెబ్‌పేజీల్లో అడిగిన సమాచారం అందుబాటులోకి వచ్చింది. నేడు 'ఛాట్ జిపిటీ' యాప్ ద్వారా అడిగిన ప్రశ్నకు నిపుణులు ఇచ్చే సమాధానాల వలె ఖచ్చితమైన పరిశోధనాత్మక సమాధానాలు కళ్లముందు కనబడుతున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా గూగుల్ కూడా "బార్డ్(బిఏఆర్‌డి)" అనే యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇదే తరహాలో చైనా కూడా "బైదూ" అనే యాప్‌కు రూపకల్పన చేస్తున్నది.

ఈ యాప్ ఆవిష్కరణతో యువతలో 'థింకింగ్ స్కిల్స్'కు ప్రమాదం ఏర్పడనుంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలు, విద్యాసంస్థలు ఇప్పటికే ఛాట్ జిపిటీ యాప్ వాడకాన్ని నిషేధించే స్థాయికి చేరింది. ఛాట్ జిపిటీ యాప్ వాడకంతో విద్యార్థుల్లో ఆలోచనాశక్తి తగ్గడంతోపాటు ఉపాధ్యాయుల బోధన అవసరాలైన లెసన్‌ప్లాన్లు, అసైన్‌మెంట్లను కూడా ఈ యాప్ అందించనున్నది. దీనితో ఉపాధ్యాయులపై పనిభారం తగ్గడంతో పాటు సమయం ఆదా కావడానికి ఆస్కారం ఏర్పడింది. ఛాట్ జిపిటీ యాప్‌ను అతిగా వాడిన యువతలో క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ క్షీణించనున్నాయి. విద్యార్థుల్లో సృజనశీల ఆలోచనల సామర్థ్యాలకు తలుపులు మూయబడతాయి. ఛాట్ జిపిటీ ఇచ్చే సమాధానాలు కొన్ని సందర్భాల్లో పూర్తిగా సరైనవిగా ఉండకపోయినా విద్యార్థులు సర్దుకు పోవలసిన అగత్యం ఏర్పడవచ్చు. ఛాట్ జిపిటీ యాప్ వాడకంతో మానవీయకోణం సమసిపోయి, సహానుభూతికి ప్రమాదం ఏర్పడుతుంది. అతిగా ఛాట్ జిపిటీ యాప్‌ను నమ్మితే వ్యక్తిలో ప్రేరణస్థాయి తగ్గిపోయి, రానున్నతరాల్లో మానవ తెలివితేటలకు ప్రాధాన్యం తగ్గుతుంది. ఇలాంటి శాస్త్రసాంకేతిక ఆవిష్కరణలతో విద్యాసంస్థలు తమ మూల్యాంకనాలు, పరీక్షా విధానాల్లో భారీ మార్పులు తేవలసి ఉంటుంది.

ఛాట్ జిపిటీ యాప్ రాకతో భవిష్యత్తు విద్యావిధానంలో కలవరపరిచే ధోరణిలా చోటు చేసుకోనున్నాయని విద్యావేత్తలు విచారం వ్యక్తం చేసు న్నారు. ఛాట్ జిపిటీ ప్రవేశంతో రానున్న రోజుల్లో ఎలాంటి అవాంఛ నీయ/వాంఛనీయ మార్పులు వస్తాయో ఇప్పుడే అంచనా వేయడం కష్టం. ఛాట్‌జిపీటీతో సాంకేతిక విప్లవం ఆగిపోతుందని అనుకోరాదు. సమీప భవిష్యత్తులో ఆర్టిఫీషియల్ జనరల్ ఇంటెలిజెన్స్(ఏజీఐ), ఎక్స్‌ప్లేన బుల్ ఏఐ(ఎక్స్‌ఏఐ), డీప్ రిఇన్ఫోర్సుడ్ లెర్నింగ్(డిఆర్‌యల్), ట్రాన్స్‌ఫర్ లెర్నింగ్ లాంటి ఆధునిక సాంకేతికతలు త్వరలో మనముందుకు సునామీలా రాను న్నాయి. ఏ ఆధునిక ఆవిష్కరణ జరిగినా మానవ మేధస్సుకు పదును పెట్టేది గా ఉండాలని, ముఖ్యంగా విద్యావిధానంలో పాత్రకు సరిహద్దులు ఉండా లని విద్యావేత్తలు, నిపుణులు, సంబంధిత సమాజం కోరుకుంటున్నారు.

- బిఎంఆర్

గొప్ప ప్రజానాయకుడు గోవింద్ పన్సారే



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

సమాజాన్ని గురించి ఆలోచిస్తూ దానిమార్పుకు జీవితాంతం శ్రమించిన ఆదర్శమూర్తి, త్యాగధనుడు గోవింద్ పండరినాథ్ పన్సారే. గోవింద్ పన్సారే(82), ఆయన సతీమణి ఉమా పన్సారే(72)లపై కొల్హాపూర్‌లో 16-02-2015న సమాజ తిరోగమనవాదులు దాడిచేశారు. 20-02-2015న గోవింద్ పన్సారే మరణించారు. పన్సారే మహారాష్ట్ర, అహ్మద్‌నగర్‌జిల్లా శ్రీరాంపూర్ తాలూకా కొల్హర్ గ్రామంలో 26-11-1933న పేద కుటుంబంలో జన్మించారు. తన ఐదు ఎకరాల భూమిని వడ్డీ వ్యాపారులు ఆక్రమించుకోగా పన్సారే తండ్రి పండరీనాథ్ చిన్న చిన్న పనులు చేశారు. తల్లి పట్టుదలతో గోవింద్ బిఎ(ఆనర్స్), ఎల్‌ఎల్‌బి కొల్హాపూర్ రాజారామ్ కళాశాలలో చదివారు. పేదరికం వలన ఆయన వార్తా పత్రికలను పంచారు. కొంతకాలం మునిసిపాలిటీ కార్యాలయంలో ప్యూన్‌గా పనిచేశారు. తర్వాత మునిసిపాలిటీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసి చివరికి న్యాయవాదిగా స్థిరపడ్డారు.

పన్సారే క్రియాశీల కార్యకర్త, సంఘ సంస్కర్త, భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు. రాష్ట్ర సమితి కార్యదర్శిగా, సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా పనిచేశారు. కార్మికులను చైతన్య పరిచారు. 1962 భారత-చైనా యుద్ధ సమయంలో అరెస్టు చేసిన ప్రథమ కమ్యూనిస్టు పన్సారే. ఆయన1987 మే ఉపన్యాసం 'శివాజీ ఎవరు?' శీర్షికతో కరపత్రంగా తర్వాత చిన్న పుస్తకంగా ప్రచురించడమైంది. అనేక భాషల్లోకి అనువదించిన ఈ పుస్తకం ఏడు ముద్రణలతో మరాఠీతో సహా రెండులక్షల ప్రతులు అమ్ముడైంది. ఈ పుస్తకం ద్వారా పన్సారే 'ఛత్రపతి శివాజీ ముస్లిం వ్యతిరేకి, బ్రాహ్మణ సమాజ సంరక్షకుడు' అన్న సాంప్రదాయవాదుల ప్రచారాలను ఖండించారు. శివాజీ పేదల పక్షపాతి, రైతుల, శూద్రుల, స్త్రీల, ముస్లింల సంక్షేమంకోసం పాటుపడ్డారని ఉదాహరణలతో వివరించారు. పన్సారే అనేక సామాజికాంశాల మీద పన్నెండు పుస్తకాలు రాశారు. వీటిని వివిధ భాషల్లోకి అనువదించడమైంది. గాంధి హంతకుడు గాడ్సేను సంఘీయులు దేశభక్తునిగా, దైవసమానునిగా కీర్తించినప్పుడు పన్సారే వ్యతిరేకించి గాడ్సే జీవిత చీకటి కోణాలను బైటపెట్టారు. పేదల సమస్యల పరిష్కారానికి, అవినీతి, కులవివక్ష, మతఛాందసం, మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడారు. గోద్రా మత ఘర్షణలను, ముంబై తీవ్రవాదదాడులను తీవ్రంగా వ్యతిరేకించారు, నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఆ సంఘటనల్లో నిజాయితీ పోలీసు అధికారులకు మద్దతు పలికారు. వారిపై ప్రభుత్వాల దమనకాండను ఖండించారు. స్త్రీ, కార్మిక సంక్షేమానికి, మానవహక్కుల పరిరక్షణకు ఉద్యమించారు. దబోల్కర్ హత్య తర్వాత మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా భారతీయ కమ్యూనిస్టు పార్టీ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం 'స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని' ప్రతిపాదించినప్పుడు కార్మికసంఘ నాయకుడైన పన్సారే ఆ పథకంలోని అపాయకర సామాజికాంశాలను ఉద్యోగులకు వివరించి ఆ పథకం అమలు కాకుండా చేశారు. పేదవారైన చెరుకు రైతులకు అనుకూలంగా అనేక కోర్టు కేసులను ఉచితంగా వాదించారు. ఈ సందర్భాలలో పంచదార పరిశ్రమల అధిపతులు కోట్ల రూపాయలకు ప్రలోభపెట్టినా లొంగలేదు. రైతులపక్షం వీడలేదు. న్యాయవాదిగా డబ్బు సంపాదన అవకాశాలను కూడా వదులుకున్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు, ప్రపంచీకరణ ఉదారవాద ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకంగా అనేక ప్రజాఉద్యమాలు నడిపారు. మహాత్మా ఫూలే, సాహు మహారాజ్, అంబేద్కర్‌ల భావాలకు పన్సారే ప్రగాఢ అనుచరుడు. ప్రజలను చైతన్యపరచడానికి, అన్యాయాలు, అణచివేతలను గుర్తించి ఎదిరించడానికి అనేక ఉద్యమాలను, నిరంతర కార్యక్రమాలను నడిపారు. ఎదిరింపు, ఆందోళన పద్ధతులతో ప్రపంచాన్ని మార్చవచ్చుననే ఉత్సాహాన్ని, విశ్వాసాన్ని పీడిత ప్రజల మనసుల్లో రగిలించారు. వందల కిలోల ధాన్యం, నెయ్యి, ఇతర సామగ్రిని బుగ్గిచేస్తున్న యజ్ఞాలను వ్యతిరేకిస్తూ కొల్హాపూర్‌లో ఉద్యమాలు నడిపారు. ప్రజలలో హేతువాద దృక్పథం మేల్కొలుపుకు 'వివేక్ జాగృతి' కార్యక్రమాలు నిర్వహించారు. మతవాద సంస్థలైన భజరంగదళ్, విశ్వ హిందు పరిషత్‌ల ఆగ్రహానికి గురయ్యారు.

శ్రీమతి ఉమా పాన్సరే, కీ.శే. గోవింద్ పాన్సరే

పన్సారే ఏకైక కుమారుడు అవినాశ్ 35 ఏళ్ల వయస్సులో మరణించారు. కొడుకు శవం ప్రక్కన నిల్చొని ఆయన, అవినాశ్ శేష కార్యక్రమాలను ఎవరు పూర్తిచేస్తారని ప్రశ్నించి, వెంటనే గుండెను కరిగించే బాధలో కూడా చతురతతో, మేము పూర్తిచేస్తామన్నారు. అలానే చేశారు. కుమారునికి, ఇద్దరు కుమార్తెలకు కులాంతర వివాహాలు చేశారు. పన్సారే అజాతశత్రువు. పరపక్షీయులు, ప్రతిపక్షీయులు, నిష్పక్షీయులు అందరినీ కలుపుకొని ఉద్యమాలుచేశారు. సంస్థలను, వాటి సభ్యులను విమర్శించకుండా సంస్థల దురాశయాలను, వ్యక్తుల దురాచారాలను సమాజానికి వివరించారు. సర్వసమాజ సమన్వయం సాధించి, సర్వ జనామోదంతో, సర్వుల సహాయ సహకారాలతో సామాజిక మార్పుకు సర్వశక్తులు ఒడ్డి పనిచేశారు. రిక్షా కార్మికులు, శ్రమజీవులు, మహారాష్ట్ర డబ్బావాలాలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, లౌకికవాదులు, ఉద్యోగులు, వామపక్ష వాదులు, ప్రతిపక్ష నేతలు, పాలకపక్ష మిత్రులు, మితవాదులు కాని రాజకీయ నాయకులు, ప్రగతికా ముకులు, శాస్త్రీయ దృక్పథ ప్రచారకులు, అన్ని తరగతుల ప్రజలు పన్సారేపై దాడిని ఖండించారు. గోవింద్ పన్సారే మరణానికి బాధపడ్డారు, సంతాపం తెలిపారు. మేమంతా దాభోల్కర్‌లమే, పన్సారేలమేనని నినదించారు. మతఛాందసుల అమానవ చర్యలను నిరసించారు. మరాఠీ రచయిత విద్యాబాల్ మానవత్వ సాంప్రదాయాలు అంతరించినందుకు బాధపడుతూ, పేదల సమస్యల పరిష్కారానికి పనిచేశారన్నారు. మహారాష్ట్రలో వామపక్షాల క్రియారాహిత్యాన్ని గుర్తిస్తూనే, "ఉత్సాహపూరిత కార్మిక సంఘాల ఉద్యమాలతో, 1960లలో ఒక ఊపు ఊపిన సామ్యవాద భావాలు, మానవ విలువలు పారిశ్రామికంగా, సాంకేతికంగా అభివృద్ధిచెందిన నేటి మహారాష్ట్రలో ప్రజలను ఆకర్షించలేకపోతున్నాయి. 1980ల తర్వాత కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు సంఘపరివారశక్తుల ప్రవేశానికి దారి కల్పించాయి." అని మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు అజిత్ అభ్యంకర్ బాధ పడ్డారు. విద్యారంగం లాంటి కీలకాంశాలను కాంగ్రెస్ అశ్రద్ధచేయడమే ప్రస్తుత పరిస్థితికి కారణమని సామ్యవాద ఆలోచనాపరుడు అరవింద్ గుప్తా అన్నారు. ఫడ్నవిస్ ప్రభుత్వం "సాంప్రదాయ" ప్రకటనలకే పరిమితమైంది. సంతాప సభలకు, తీర్మానాలకు కూడా అనుమతించలేదు.

అసంతృప్తి అంతమయ్యే దాకా ఉద్యమాలు ఆగవు. ఉద్యమకారులు అమరులు. మహానుభావుల జీవితకాలంలో చాలామంది వారిని పట్టించుకోరు, భావసారూప్య సహచరులతో సహా. "ఈయన లేని లోటు తీర్చలేనిది" వంటి పడికట్టు పదాలతో, మరణించినప్పుడు, సంతాపిస్తారు. పన్సారే తన కొడుకు అకాలమృత్యువు తర్వాత ఆచరించిన మార్గాన్ని అనుసరించడమే ఆయనకు నిజమైన నివాళి కాగలదు. సమానత అవకాశాలను అందరికీ అందించడానికి సామాజిక శాస్త్రవేత్తలు, కార్యకర్తలు ముందుగా తమ స్వల్ప విబేధాలను విస్మరించి, విప్లవదిశలో పయనించాలి. ప్రజలకు ప్రత్యామ్నాయాలను సూచించి, ప్రదర్శించి నమ్మకాన్ని కలిగించాలి. సమాలోచనా సమయమిది. మతవాద సంఘీయులు దేశంలోని విద్యా, సామాజిక, సాంస్కృతిక రంగాలను ఆక్రమించి బహుళత్వ ప్రజాస్వామ్య, సామ్యవాద, లౌకికభావాలకు, రాజ్యాంగస్ఫూర్తికి తూట్లుపొడిచి సామాజిక ఉద్యమకారులను, తమ భావజాలాలతో ఏకీభవించనివారిని చంపుతున్న నేటి అరాచక పాలనలో కూడా భౌతికవాదులు, ప్రగతిశీలురు సంఘటితమవ్వకపోతే భావితరాలు మన్నించవు. ప్రజాపక్షీయుల ఐకమత్యంతో మతఛాందసులకు ఓటమి తప్పదు.

- ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి
సెల్: 9490204545

అసెంబ్లీల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలి

- ప్రతి రంగంలో వారి పాత్ర ఎక్కువగావుండాలి
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఇటానగర్ : దేశ సమ్మిళిత అభివృద్ధి కోసం అరుణాచల్ ప్రదేశ్‌తో సహా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళల భాగస్వామ్యం తప్పనిసరిగా పెరగాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం అన్నారు. ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని ఉద్దేశించి ఆమె ప్రసంగిస్తూ, అరుణాచల్ ప్రదేశ్ దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషిస్తోందని, రాష్ట్రంపై 'అభివృద్ధి సూర్యుడు' ప్రకాశిస్తున్నాడని నొక్కి చెప్పారు. 'మన దేశ సమగ్ర, సమ్మిళిత అభివృద్ధి కోసం, ప్రతి పని రంగంలో మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉండాలి. అరుణాచల్ ప్రదేశ్‌తో సహా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలతో పాటు ఇతర ప్రజాప్రాతినిధ్య సంస్థలలో మహిళల భాగస్వామ్యం పెరగాలి' అని ఆమె అన్నారు. అరుణాచల్ ప్రదేశ్ భారతదేశంలో ముఖ్యమైన భాగమని, యాక్ట్ ఈస్ట్ పాలసీలో ప్రధాన వాటాదారు అని ముర్ము నొక్కి చెప్పారు. 'రోడ్లు, రైల్వే, విమాన అనుసంధానం లేకపోవడం వల్ల ఈశాన్య చాలా కాలంగా ఆర్థికాభివృద్ధికి దూరమైంది. కానీ కేంద్రం అనుసంధానం, ఈ ప్రాంత అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది' అని అన్నారు. 'అరుణాచల్ ప్రదేశ్‌పై అభివృద్ధి సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. గొప్ప సహజ వనరులు, నాణ్యమైన మానవ వనరులతో రాష్ట్రం ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానంగా, వాణిజ్యం, వ్యాపార కేంద్రంగా మారడానికి పూర్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది' అని ఆమె తెలిపారు. రాష్ట్ర విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు శాయశక్తులా కృషి చేయాలని రాష్ట్రపతి శాసనసభ్యులకు పిలుపునిచ్చారు. 'వైవిధ్యమైన సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన అరుణాచల్ ప్రదేశ్‌కు దేశంలోనే ప్రత్యేక స్థానం ఉంది. వాటిని సంరక్షించేందుకు కృషి చేయాలి' అని ముర్ము అన్నారు. 'నేటి యుగంలో పర్యావరణ కాలుష్యం, వాతావరణ మార్పులు క్లిష్టమైన సమస్యలు. మనం ఈ ఆందోళనలకు త్వరగా పరిష్కారాలను కనుగొనాలి. అరుణాచల్ ప్రదేశ్ వంటి భౌగోళికంగా సున్నితమైన రాష్ట్రానికి ఈ విషయాలు మరింత ముఖ్యమైనవి. ఈ రాష్ట్ర విధాన నిర్ణేతలు పక్కే డిక్లరేషన్ ద్వారా వాతావరణ మార్పులపై నిబద్ధత చూపడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించారని గమనించడం నాకు సంతోషంగా ఉంది' అని ఆమె అన్నారు. వాతావరణ మార్పు సమస్యను పరిష్కరించడానికి ఇతర రాష్ట్రాలు కూడా ఈ నమూనాను అవలంబిస్తాయన్న ఆశాభావాన్ని ముర్ము వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి డోనర్ మంత్రిత్వ శాఖను రూపొందించడంలో మాజీ ప్రధాని అతల్ బిహారీ వాజ్‌పేయి చేసిన కృషిని గుర్తు చేసుకున్న రాష్ట్రపతి, అభివృద్ధి చెందిన ఈశాన్య రాష్ట్రానికి కేంద్రంలోని ప్రస్తుత ప్రభుత్వం వివిధ ప్రాజెక్టులను మంజూరు చేయడంతో తన కల సాకారమైందని అన్నారు. రాష్ట్రపతి ముర్ము... ఇ-విధాన్ చొరవ ద్వారా పేపర్‌లెస్‌గా వెళ్లాలనే రాష్ట్ర అసెంబ్లీ నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ, ఇటువంటి ఆవిష్కరణ ఇతర రాష్ట్రాలు అనుకరించడానికి ఆదర్శ నమూనాగా ఉండాలని అన్నారు. అలాగే యువత పరిశోధనలకు దోహదపడే విధంగా అసెంబ్లీ సచివాలయం లైబ్రరీని ప్రారంభించడం అభినందనీయమన్నారు. 'నో యువర్ అసెంబ్లీ' కార్యక్రమం కింద అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీకి విద్యార్థులను చట్టసభల పని తీరును తెలుసుకునేందుకు ఆహ్వానిస్తున్నారని ప్రశంసిస్తూ, యువతరం తప్పనిసరిగా ఇలాంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని దేశ ప్రగతికి దోహదపడాలని అన్నారు. శతాబ్దాలుగా అరుణాచల్ ప్రదేశ్‌లో స్వయం పాలన, అట్టడుగు ప్రజాస్వామ్య శక్తివంతమైన వ్యవస్థ ఉందని పేర్కొన్న రాష్ట్రపతి ముర్ము... రాష్ట్ర ప్రజలు ఆధునిక ప్రజాస్వామ్య ప్రక్రియలో కూడా చురుగ్గా పాల్గొన్నారని, ఇది వారి రాజకీయ స్పృహ, ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపారు.

గవర్నరు ప్రసంగం బహిష్కరించిన విపక్షాలు

ఒడిశా అసెంబ్లీలో గందరగోళం

భువనేశ్వర్: ఒడిశా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మంగళవారం గందరగోళం మధ్య ప్రారంభమయ్యాయి. గవర్నరు గణేషీ లాల్ ప్రసంగాన్ని ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ బహిష్కరించాయి. మంత్రి నబా కిశోర్ దాస్ దారుణహత్య, రాష్ట్రంలోని శాంతిభద్రతలపై బీజేడీ ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు తూర్పారబట్టాయి. సభ సమావేశం కాగానే సీఎల్‌పీ నేత నరసింగ మిశ్రా లేచి మంత్రి ప్రాణాలు కాపాడటంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. వెంటనే కాంగ్రెస్ సభ్యులంతా వెల్‌లోకి దూసుకొచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొలుత తమ స్థానాల్లో నిలబడి నిరసన తెలిపిన బీజేపీ సభ్యులు...తర్వాత కాంగ్రెస్ సభ్యులతో కలిసి వెల్‌లోకి వచ్చారు. బీజేడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గవర్నరు తన ప్రసంగం కొనసాగించడానికి లేవగానే బీజేపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. కాంగ్రెస్ సభ్యులు కూడా వారిని అనుసరించారు. రాష్ట్ర అభివృద్ధిపై తప్పుడు సమాచారం ఇస్తున్నందున గవర్నరు ప్రసంగాన్ని తాము బహిష్కరిస్తున్నామని, శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయని బీజేపీ చీఫ్ విప్ మోహన్ మఝీ చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ సభ్యుడు సురేశ్ రౌత్రే అసెంబ్లీ వెలుపల విలేకరులతో మాట్లాడుతూ 'గవర్నరును మేము వ్యతిరేకించడం లేదు. ఆయన మంచి వారు. అయితే, తప్పుడు సమాచారాన్ని ఆయన నోటి ద్వారా బీజేడీ ప్రభుత్వం చెప్పిస్తోంది. అందుకే మేము బహిష్కరిస్తున్నాం' అని చెప్పారు. బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రవేశమార్గంలో ప్లకార్డులు ధరించి బైఠాయించారు. గవర్నరు ప్రసంగం అనంతరం ప్రతిపక్ష సభ్యులు సభలోకి వచ్చారు. సంతాప తీర్మానంపై మాట్లాడారు. సభను స్పీకర్ బుధవారానికి వాయిదా వేశారు.

13 మంది ఎంపీలకు సన్సద్ రత్న అవార్డులు

న్యూఢిల్లీ: ఈ ఏడాది సన్సద్ రత్న అవార్డులకు 13 మంది ఎంపీలు ఎంపికయ్యారు. అందులో కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి, ఆర్‌జేడీ నేత మనోజ్ ఝా, సీపీఎం నేత జాన్ బ్రిట్టాస్ ఉన్నారు. 13 మంది ఎంపీలలో 8 మంది రాజ్యసభ నుంచి, ఐదుగురు లోక్‌సభ నుంచి ఎంపికయ్యారని, అందులో ముగ్గురు పదవీ విరమణ చేసిన సభ్యులు కూడా ఉన్నారని ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. కేంద్రమంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ అధ్యక్షుడిగా, భారత మాజీ ఎన్నికల ప్రధాన కమిషనర్ ఎస్.కృష్ణమూర్తి సహ అధ్యక్షుడగా గల జ్యూరీ కమిటీ అవార్డులకు ఎంపీలను ఎంపిక చేసింది. మరో ఇద్దరిని ప్రత్యేక అవార్డుల కేటగిరీలో ఎంపిక చేశారు. కమిటీలో ప్రముఖ పార్లమెంటేరియన్లు, పౌర సమాజ సభ్యులు ఉన్నారు. వివిధ కేటగిరీల కింద 17వ లోక్‌సభలో అద్భుత ప్రదర్శన కనబర్చిన విద్యుత్ బరన్ మహతో(బీజేపీ), డా.సుకాంత మజుందార్(బీజేపీ), కుల్దీప్ రాయ్ శర్మ(కాంగ్రెస్), డా.హీనా విజయ్‌కుమార్ గవిట్(బీజేపీ), గోపాల్ చిన్నయ్య శెట్టి(బీజేపీ), సుధీర్ గుప్తా(బీజేపీ), డా.అమోల్ రామ్‌సింగ్ కోల్హే(ఎన్‌సీపీ)లను కమిటీ ఎంపిక చేసింది. ప్రశ్నోత్తరాలు, ప్రైవేట్ మెంబరు బిల్లు ప్రవేశపెట్టడం, చర్చ ప్రారంభించడం వంటి అంశాల ఆధారంగా నామినేషన్లు జరిగాయి. పీఆర్ఎస్ ఇండియా, లోక్‌సభ, రాజ్యసభ సెక్రటరియేట్ అందించిన డేటా ఆధారంగా సభ్యుల పనితీరును పరిశీలించారు. సిట్టింగ్ మెంబర్స్ కేటగిరిలో రాజ్యసభ నుంచి బ్రిట్టాస్, ఝా, ఫాజియా తహసీన్ అహ్మద్ ఖాన్(ఎన్‌సీపీ) ఎంపిక కాగా పదవీ విరమణ కేటగిరిలో విశ్వంభర ప్రసాద్ నిషాద్(ఎస్పీ), చాయా వర్మ(కాంగ్రెస్) ఉన్నారు. ఆర్థిక కమిటీ చైర్మన్ జయంత్‌సిన్హా(బీజేపీ), రవాణా, పర్యాటకం, సంస్కృతి కమిటీ చైర్మన్ వి.విజయసాయిరెడ్డి(వైసీపీ)లను కూడా సన్సద్ అవార్డులకు నామినేట్ చేశారు. భారత రాజకీయాలు, సమాజం, ప్రజలకు విశేష సేవలందించిన నాయకుల గౌరవార్థం 2022లో డా.ఏపీజే అబ్దుల్ కలాం లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రవేశపెట్టారు. దీనికి రాజ్యసభ మాజీ ఎంపీ, సీపీఎం సీనియర్ నేత టీకే రంగరాజన్‌ను ఎంపిక చేశారు. ఈ అవార్డును మార్చి 25న ప్రదానం చేయనున్నట్లు ఫౌండేషన్ తెలిపింది. అబ్దుల్ కలాం సూచన మేరకు సన్సద్ రత్న అవార్డులనే ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 90మంది పార్లమెంటేరియన్లను ఈ అవార్డుతో సత్కరించారు.

పార్లమెంటు సముదాయంలో షిండే శివసేన వర్గానికి కార్యాలయం

న్యూఢిల్లీ : ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని వర్గాన్ని నిజమైన శివసేనగా గుర్తిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకున్న తర్వాత లోక్‌సభ సెక్రటేరియట్ శివసేన కార్యాలయాన్ని పార్లమెంటు సముదాయంలో కేటాయించింది. షిండే వర్గానికి చెందిన ఫ్లోర్ లీడర్ రాహుల్ షెవాలే రాసిన లేఖపై లోక్‌సభ సెక్రటేరియట్ స్పందిస్తూ, పార్లమెంటు భవనంలోని శివసేన కార్యాలయం కోసం కేటాయించిన గదిని పార్టీకి కేటాయించినట్లు తెలిపారు. 1966లో తన తండ్రి బాల్ థాకరే స్థాపించిన పార్టీపై ఉద్ధవ్ థాకరే వాదనను ఆచరణాత్మకంగా తిరస్కరిస్తూ, ఎన్నికల సంఘం గతవారం షిండే వర్గాన్ని అసలైన శివసేనగా గుర్తిస్తూ, ఎన్నికల్లో 'విల్లు-బాణం' గుర్తును ఉపయోగించడానికి అనుమతించింది. ఆ తర్వాత ఫిబ్రవరి 18న షెవాలే లోక్‌సభ సెక్రటేరియట్‌కు పార్టీకి కార్యాలయాన్ని కేటాయించాలని కోరుతూ లేఖ రాశారు. ఇప్పటి వరకు పార్లమెంటు సముదాయంలోని శివసేన కార్యాలయాన్ని రెండు వర్గాలు ఉపయోగించుకుంటున్నాయి.

ఈడీ దాడులకు నిరసనగా కాంగ్రెస్ ధర్నా

రాయ్‌పూర్: బొగ్గు లెవీ కుంభకోణం పేరుతో ఎన్‌ఫోర్సుమెంటు డైరెక్టరేట్(ఈడీ) దాడులకు నిరసనగా కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. రాయ్‌పూర్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట మంగళవారం భారీ ధర్నా నిర్వహించింది. బీజేపీ చేతిలో ఈడీ కీలుబొమ్మగా మారిందని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. బీజేపీ కోసమే ఇలాంటి చర్యలకు దిగుతోందని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్‌లో కొంతమంది కాంగ్రెస్ నాయకుల ఇళ్లు, కార్యాలయాల్లో సోమవారం ఈడీ సోదాలు నిర్వహించిన విషయం విదితమే. దీనికి నిరసనగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇక్కడి ఈడీ కార్యాలయం ఎదుట భారీ నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే ధనేంద్ర సాహు, రాజ్యసభ మాజీ సభ్యుడు ఛాయా వర్మ, కాంగ్రెస్ పార్టీ రాయ్‌పూర్ జిల్లా అధ్యక్షుడు గిరీశ్ దూబే నాయకత్వంలో ధర్నా జరిగింది. మోదీ ప్రభుత్వం, ఈడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజకీయ ప్రత్యర్థులపై కేంద్ర సంస్థలను మోదీ సర్కారు దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. ఈడీ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. బొగ్గు లెవీ స్కాం ఆరోపణలపై విచారణలో భాగంగా ఈడీ సోమవారం కాంగ్రెస్ నాయకుల ఇళ్లలో సోదాలు నిర్వహించింది. ఫిబ్రవరి 24వ తేదీ నుంచి రాయ్‌పూర్‌లో కాంగ్రెస్ ప్లీనరీ జరగడానికి ముందు ఈడీ దాడులకు పూనుకుంది. కాంగ్రెస్‌ను చూసి బీజేపీ భయపడుతోందని, అందుకే కేంద్ర సంస్థలను అడ్డుపెట్టుకొని ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఛాయావర్మ విమర్శించారు. ఇలాంటి దాడులకు తాము భయపడబోమన్నారు. బీజేపీ కుట్రలపై పోరాటం చేస్తామని, మరింత బలంగా తయారవుతామని పేర్కొన్నారు. ఈడీ దాడులపై సీఎం భూపేశ్ బాఘెల్ సోమవారం స్పందిస్తూ కాంగ్రెస్ నాయకుల ఇళ్లపై దాడులు రాజకీయ కుట్రలో భాగమేనని విమర్శించారు. కాంగ్రెస్ అంటే భయంతోనే రాజకీయ ప్రత్యర్థుల వాణిని అణచడానికి కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు.

ఆర్ఎస్ఎస్ కవాతుతో శాంతిభద్రతల సమస్య

సుప్రీంలో తమిళనాడు ప్రభుత్వం వ్యాజ్యం

చెన్నై : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) రాష్ట్రంలో తమ రూట్ కవాతును రీషెడ్యూల్ చేసిన తేదీల్లో చేపట్టేందుకు అనుమతిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ రూట్ కవాతు వల్ల శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని, హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొంది. ఫిబ్రవరి 10న మద్రాస్ హైకోర్టు తమిళనాడులో ఆర్ఎస్ఎస్ తమ రూట్ కవాతను రీషెడ్యూల్ చేసిన తేదీల్లో నిర్వహించేందుకు అనుమతి ఇస్తూ ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి నిరసనలు అవసరమని పేర్కొంది. ప్రతిపాదిత రాష్ట్రవ్యాప్త రూట్ మార్చ్‌పై షరతులు విధించిన సింగిల్ జడ్జి నవంబర్ 4, 2022న జారీ చేసిన ఉత్తర్వును రద్దు చేస్తూ ఆర్ఎస్ఎస్ కవాతును ఇంటి లోపల లేదా పరివేష్టిత ప్రదేశంలో నిర్వహించాలని కోరుతూ సెప్టెంబరు 22, 2022 నాటి ఉత్తర్వులను కోర్టు పునరుద్ధరించింది. దీని ప్రకారం, రూట్ కవాతు/శాంతియుత ఊరేగింపును నిర్వహించడం కోసం అప్పీలుదారులు తమకు నచ్చిన మూడు వేర్వేరు తేదీలతో రాష్ట్ర అధికారులను సంప్రదించాలని పేర్కొంటూ, ఈ మూడింటిలో ఎంచుకున్న తేదీలలో ఒకదానిలో వారికి అనుమతి ఇవ్వాలని రాష్ట్ర అధికారులను ఆదేశించింది. అలాగే ఆర్ఎస్ఎస్ కఠినమైన క్రమశిక్షణను పాటించాలని, కవాతు సమయంలో వారి వైపు నుంచి రెచ్చగొట్టడం ఉండకూడదని నిర్ధారించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, ఊరేగింపు, సభ ప్రశాంతంగా జరిగేలా ట్రాఫిక్ ఏర్పాట్లు చేయాలని ధర్మాసనం పేర్కొంది. 75వ స్వాతంత్ర్య సంవత్సరం, భారతరత్న బీఆర్ అంబేద్కర్ జయంతి, విజయదశమి పండుగను పురస్కరించుకుని 2022 అక్టోబర్ 2న వివిధ ప్రదేశాలలో రూట్ కవాతును నిర్వహించడంతోపాటు బహిరంగ సభ నిర్వహించేందుకు ఆర్ఎస్ఎస్ అనుమతి కోరింది.

త్వరలో డిజిటల్ లావాదేవీలు నగదును మించిపోతాయి

- ప్రధాని మోదీ
- యూపీఐ-సింగపూర్ పేనౌ అనుసంధానం ప్రారంభం

న్యూఢిల్లీ : యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) దేశంలో అత్యంత ప్రాధాన్య చెల్లింపు విధానంగా మారుతున్నందున డిజిటల్ లావాదేవీలు త్వరలో నగదును అధిగమిస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం ఆశాభావం వ్యక్తం చేశారు. సింగపూర్‌కు చెందిన పేనౌ, యూపీఐ మధ్య సీమాంతర అనుసంధానాన్ని ప్రారంభించిన తర్వాత మోదీ మాట్లాడుతూ 2022లో యూపీఐ ద్వారా దాదాపు 2 ట్రిలియన్ సింగపూర్ డాలర్లు అంటే దాదాపు 2 ట్రిలియన్ డాలర్లు అంటే రూ.126 ట్రిలియన్ల కంటే ఎక్కువ మొత్తంలో 74 బిలియన్ల లావాదేవీలు జరిగాయి. అతి త్వరలో భారతదేశ డిజిటల్ వాలెట్ లావాదేవీలు నగదు లావాదేవీలను అధిగమించబోతున్నాయని చాలా మంది నిపుణులు అంచనా వేస్తున్నారని, యూపీఐ ద్వారా జరిగే పెద్ద సంఖ్యలో లావాదేవీలు దేశీయంగా రూపొందించిన ఈ చెల్లింపు వ్యవస్థ చాలా సురక్షితమైనదని నిరూపిస్తున్నాయని ఆయన అన్నారు. ప్రధాని మోదీ... సింగపూర్ ప్రధాని లీ హ్సీన్ లూంగ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యూపీఐ, సింగపూర్‌కు చెందిన పేనౌ మధ్య సీమాంతర అనుసంధానాన్ని ప్రారంభించారు. మొదటి లావాదేవీని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్, మానిటరీ అథారిటీ ఆఫ్ సింగపూర్ (ఎంఏఎస్) మేనేజింగ్ డైరెక్టర్ రవి మీనన్ చేశారు. ఈ అనుసంధానం ఏ దేశంలోనైనా రెండు వేగవంతమైన చెల్లింపు వ్యవస్థల వినియోగదారులను వారి సంబంధిత మొబైల్ యాప్‌లను ఉపయోగించి అనుకూలమైన, సురక్షితమైన, తక్షణ, తక్కువ ఖర్చుతో కూడిన సీమాంతర బదిలీలు చేయడానికి అనుమతిస్తుంది. ఇది సింగపూర్‌లోని భారతీయ ప్రవాసులకు, ముఖ్యంగా వలస కార్మికులు, విద్యార్థులకు, సింగపూర్ నుంచి భారతదేశానికి తక్షణం, తక్కువ ఖర్చుతో డబ్బు బదిలీ చేయడం చేస్తుంది. ఫిన్‌టెక్ ఆవిష్కరణల కోసం భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పర్యావరణ వ్యవస్థలలో ఒకటిగా అవతరించింది. ఆవిష్కరణ, ఆధునీకరణను ప్రోత్సహించడమే ప్రభుత్వ దృష్టి అని పేర్కొన్న మోదీ... ప్రభుత్వ డిజిటల్ ఇండియా కార్యక్రమం 'సులభతర జీవనం', 'సులభతర వాణిజ్యం', సాంకేతికత అనుసంధానాన్ని, ఆర్థిక చేరికను పెంచిందని అన్నారు. డిజిటల్ ఇండియా కార్యక్రమం పాలన, ప్రజా సేవల పంపిణీలో గణనీయమైన సంస్కరణలను వచ్చిందని తెలిపారు. బ్యాంక్ ఖాతాలు లేదా ఇ-వాలెట్లలో ఉన్న నిధులను కేవలం యూపీఐ-ఐడీ, మొబైల్ నంబర్ లేదా వర్చువల్ చెల్లింపు చిరునామా (వీపీఏ) ఉపయోగించి భారతదేశానికి లేదా భారతదేశం నుంచి బదిలీ చేయవచ్చని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. దీనిని ప్రారంభించడానికి భారతీయ స్టేట్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ లోపలికి, బాహ్య చెల్లింపులను సులభతరం చేస్తాయని, అయితే యాక్సిస్ బ్యాంక్, డీబీఎస్ ఇండియా లోపలికి చెల్లింపులను సులభతరం చేస్తాయని ప్రకటన పేర్కొంది. పైన భాగస్వామ్య బ్యాంకుల ఖాతాదారులకు బ్యాంక్ మొబైల్ బ్యాంకింగ్ యాప్ లేదా ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ని ఉపయోగించి సింగపూర్‌కు సరిహద్దు చెల్లింపులను చేపట్టవచ్చు. అయితే ప్రారంభంలో ఒక భారతీయ వినియోగదారు ఒక రోజులో రూ.60 వేలు (సుమారు 1,000 ఎస్‌జీడీకి సమానం) వరకు చెల్లింపు చేయవచ్చు. లావాదేవీ చేసే సమయంలో వ్యవస్థ వినియోగదారు సౌలభ్యం కోసం రెండు కరెన్సీలలో మొత్తాన్ని లెక్కించి ప్రదర్శిస్తుందని ఆ ప్రకటన వివరించింది.

సుప్రీం విచారణలు ప్రత్యక్ష లిప్యంతరీకరణ

ప్రయోగాత్మకంగా ప్రారంభించిన సీజేఐ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు మొట్టమొదటగా మంగళవారం నుంచి ప్రయోగాత్మకంగా తన విచారణల ప్రత్యక్ష లిప్యంతరీకరణ (లైవ్ ట్రాన్స్‌స్క్రిప్షన్) కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సహజ భాషా ప్రక్రియ సాంకేతికతను ఉపయోగించడం ప్రారంభించింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్ కోర్టు గదిలో ప్రత్యక్ష లిప్యంతరీకరణ ప్రక్రియను ప్రారంభించారు. రాజ్యాంగ ధర్మాసనం విచారణలు మంగళవారం నుంచి లిప్యంతరీకరించనున్నారు. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడానికి ముందు పరిశీలన కోసం న్యాయవాదులకు వాటిని ఇస్తారు. ఇది ఒక ప్రమాణంగా మారడానికి ముందు ట్రాన్స్‌స్క్రిప్షన్‌లో లోటుపాట్లను తొలగించడానికి ఒకటి లేదా రెండు రోజుల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఉంటుందని సీజేఐ తెలిపారు. 'మీకు స్క్రీన్ కనిపిస్తోందా? మేము ప్రత్యక్ష లిప్యంతరీకరణ అవకాశాలను అన్వేషించడానికి ప్రయత్నిస్తున్నాము. అప్పుడు మేము వాదనల శాశ్వత రికార్డును కలిగి ఉంటాము. న్యాయ కళాశాలలు విశ్లేషించగలవు' అని రాజ్యాంగ ధర్మాసనం విచారణ ప్రారంభం కాగానే సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది.

8 రాష్ట్రాల్లో ఎన్ఐఏ దాడులు

న్యూఢిల్లీ: గ్యాంగ్‌స్టర్లు, ఉగ్రవాద సంస్థలు, డ్రగ్ మాఫియా మధ్య సంబంధాల కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) మంగళవారం దాడులు చేసింది. 8 రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో ఏకకాలంలో పెద్దఎత్తున తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు చెప్పారు. ఢిల్లీ, మహారాష్ట్ర, పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్, గుజరాత్, మధ్యప్రదేశ్‌లో దాడులు జరిపినట్లు తెలిపారు. పాకిస్తాన్‌లో తలదాచుకుంటున్న హర్వీందర్‌సింగ్ సంధు అలియాస్ రిండాను ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించిన కొన్ని రోజుల తర్వాత ఎన్ఐఏ ఈ చర్యలకు ఉపక్రమించింది. రిండా అనేక కేసుల్లో నిందితుడిగా అనుమానిస్తున్నారు. ఢిల్లీ, దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉగ్రవాద కార్యకలాపాల కోసం నిధుల సేకరణ, యువకుల నియామకం వంటి చర్యలకు పాల్పడటం, నేరముఠాలతో సంబంధాలు కొనసాగించడం వంటి రెండు కేసులను ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం గతేడాది నమోదు చేసింది. ప్రముఖుల హత్యకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు ఉన్నాయి.

మాతృభాష రక్షణ అవసరం: విజయన్

తిరువనంతపురం: మాతృభాషను పరిరక్షించుకోవడానికి నిరంతరం ప్రయత్నించాల్సిన అవసరం ఉందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మంగళవారం స్పష్టంచేశారు. ఇది కేవలం సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం కోసమే కాదని, మన సంస్కృతి పునాదులను పటిష్ఠవంతం చేయడం కోసమని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయన్ ఈ మేరకు ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. ప్రపంచంలోని విభిన్న భాషలను గుర్తించడం ద్వారా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని అర్థవంతంగా జరుపుకోవాలని, మన మాతృభాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని విజయన్ పేర్కొన్నారు. ఒకవ్యక్తి తన ఆలోచనలు, మనోభావాలు, అనుభవాలను మాతృభాష ద్వారా మాత్రమే సమగ్రంగా వ్యక్తీకరించగలడని తెలిపారు.

ఉద్ధవ్ పిటిషన్‌పై సుప్రీం విచారణ నేడు

న్యూఢిల్లీ: శివసేన పార్టీ, ఎన్నికల గుర్తుపై కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఉద్ధవ్ ఠాక్రే వర్గం దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం విచారించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. శివసేన పార్టీ, దాని ఎన్నికల గుర్తు ఏక్‌నాథ్ శిందే వర్గానిదేనని కేంద్ర ఎన్నికల సంఘం తీర్పు ఇచ్చిన విషయం విదితమే. ఠాక్రే వర్గం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఈ విషయాన్ని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ కృష్ణ మురారీ, జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ఈసీ ఆదేశాలపై స్టే ఇవ్వకపోతే పార్టీ గుర్తు, బ్యాంకు ఖాతాలు శిందే వర్గం చేజిక్కించుకుంటుందని, అందువల్ల రాజ్యాంగ ధర్మాసనం ముందుకు రేపే(బుధవారం) ఈ విషయాన్ని తీసుకురావాలని సిబల్ విన్నవించారు. సిబల్ విజ్ఞప్తి మేరకు బుధవారం మధ్యాహ్నం 3.30గంటలకు ఈ విషయంపై విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టంచేసింది.

నేడు ఢిల్లీ మేయర్ ఎన్నిక

న్యూఢిల్లీ : సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఢిల్లీకి కొత్త మేయర్ ఎన్నిక బుధవారం జరగనుంది. మునిసిపల్ కార్పొరేషన్ గతంలో అత్యున్నత పదవికి ఎన్నికలను నిర్వహించడానికి మూడు సార్లు విఫల ప్రయత్నాల తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మేయర్ ఎన్నికకు వేదిక సిద్ధమయింది. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా గత వారం మునిసిపల్ కౌన్సిల్‌ను సమావేశపరిచేందుకు అనుమతి ఇవ్వడంతో మేయర్, డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీలోని ఆరుగురు సభ్యుల పదవులకు ఫిబ్రవరి 22న ఎన్నికలు జరగనున్నాయి. మేయర్, డిప్యూటీ మేయర్, స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికల తేదీని నిర్ణయించడానికి ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) మొదటి సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి 24 గంటల్లో నోటీసు జారీ చేయాలని ఫిబ్రవరి 17న అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఎన్నికలను త్వరగా నిర్వహించాలని కోరుతూ అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) మేయర్ అభ్యర్థి షెల్లీ ఒబెరాయ్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన తర్వాత కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) చట్టం-1957 ప్రకారం, పౌర ఎన్నికల తర్వాత సభ మొదటి సమావేశంలోనే మేయర్, డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకోవాలి. అయితే గత డిసెంబరు 4న మున్సిపల్ ఎన్నికలు జరిగి రెండు నెలలు దాటింది. నిబంధనల ప్రకారం పన్నుల షెడ్యూల్‌ను ఫిబ్రవరి 15 లేదా అంతకుముందు సభ ఆమోదించాలి. అయితే మేయర్ నేతృత్వంలోని కొత్త కౌన్సిల్ ఫిబ్రవరి 22న అమల్లోకి వస్తుంది. అందువల్ల మిగిలిన బడ్జెట్‌ను మార్చి 31లోపు సభ ఆమోదించాలని భావిస్తున్నారు.

పెద్ద ఎగుమతి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ఎలక్ట్రికల్ పరిశ్రమను కోరిన కేంద్ర వాణిజ్య మంత్రి గోయల్

న్యూఢిల్లీ : ఎలక్ట్రికల్ పరిశ్రమ వృద్ధికి భారీ సామర్థ్యాన్ని కలిగి ఉన్నందున పెద్ద ఎగుమతుల లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఆ దిశగా పని చేయాలని వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ మంగళవారం కోరారు. కాగా, ఈ రంగం 10 బిలియన్ డాలర్ల ఎగుమతులను తాకింది. వచ్చే ఐదేళ్లలో దీనిని 25 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. 'కానీ నేను ఈ ప్రదర్శనతో చాలా సంతోషంగా ఉన్నాను. విచారంగా కూడా ఉన్నాను. 'యే దిల్ మాంగే మోర్'... ఎలక్ట్రికల్ పరిశ్రమ భారతదేశాన్ని ప్రపంచవ్యాప్తంగా గర్వించేలా చేసింది. ప్రపంచం మన వేదికగా మారే సమయం వచ్చింది. మనం అభివృద్ధి చెందుతున్న దేశాలలో మాత్రమే కాకుండా ప్రపంచంలోని అభివృద్ధి చెందిన ప్రాంతంలో కూడా ప్రదర్శనలను కలిగి ఉండాలి' అని ఎలక్ట్రికల్ పరిశ్రమ నిర్వహించిన ఒక కార్యక్రమంలో గోయల్ అన్నారు. ఇతర దేశాలతోపాటు ఐరోపా, అమెరికాలో ప్రదర్శనలు నిర్వహించాలని పరిశ్రమకు సూచించారు. 'మనం నేరుగా పెద్ద మార్కెట్‌లలోకి వెళ్లి ప్రపంచవ్యాప్తంగా మన ఉనికిని, ప్రపంచ స్థాయి నాణ్యతా ప్రమాణాలను ప్రదర్శించాలి. భారతదేశం వారి శక్తి అవసరాలన్నింటిలో నమ్మకమైన, విశ్వసనీయ భాగస్వామిగా ఉండగలదని మనం ప్రపంచానికి చూపించాలి' అని ఆయన అన్నారు. దేశంలోకి పంపబడిన తక్కువ నాణ్యత గల వస్తువుల నుంచి అన్యాయమైన పోటీ నుంచి పరిశ్రమను రక్షించడానికి నాణ్యత నియంత్రణ ఆదేశాలు సహాయపడతాయని మంత్రి తెలిపారు. 'నాణ్యత స్పృహ పరంగా చిన్న కంపెనీలకు మద్దతు ఇవ్వాలని నేను కంపెనీలను కోరుతున్నాను' అని అన్నారు.

ఆ ఇద్దరు మహిళాధికారులపై

బదిలీవేటు

బెంగళూరు: సోషల్ మీడియా వేదికగా ఘర్షణకు దిగిన కర్ణాటకలోని ఇద్దరు సీనియర్ మహిళా ఉన్నతాధికారుల వ్యవహారాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా తీసుకుంది. ఆ ఇద్దరు మహిళా అధికారులపై బదిలీవేటు వేసింది. హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ, ఐపీఎస్ అధికారి డి.రూప, దేవాదాయ శాఖ కమిషనర్ రోహిణి సింధూరి ఒకరినొకరు దూషించుకున్నారు. వీరి ద్దరిని బదిలీ చేస్తూ కర్ణాటక ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేసింది. ఐఏఎస్ అధికారిణి రోహిణి సింధూరి ప్రస్తుతం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా ఆ స్థానంలో ఐఏఎస్ అధికారి హెచ్ బసవరాజేంద్రను నియమించారు. కర్ణాటక హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీగా పని చేస్తున్న రూప స్థానంలో ఐఏఎస్ అధికారి డి.భారతిని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. తక్షణమే ఈ నియామకాలు అమల్లోకి వస్తాయని తెలి పింది. ప్రస్తుతానికి రూపకు, రోహిణి సింధూరికి ప్రభుత్వం ఎలాంటి పోస్టింగ్ ఇవ్వలేదు. రూప భర్త మునీష్ మౌద్గిల్ కూడా ఐఏఎస్ అధికారే. తాజా వ్యవహారంతో ప్రభుత్వం ఆయనపై కూడా చర్యలు చేపట్టింది. మునీష్‌ను ప్రచార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రతి ఎకరాకు నీరందించాలి

- వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనివ్వాలి
- తోటపల్లి ప్రాజెక్టు సందర్శనలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర, పార్వతీపురం/బెలగాం: రాష్ట్రంలోని ప్రతి ఎకరాభూమికి సాగునీరు అందించే చర్యలు ప్రభుత్వమే చేపట్టాలని, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని, రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి బ్యారేజి, ఎడమకాలువలను సీపీఐ రాష్ట్ర బృందం మంగళవారం పరిశీలించింది. ముందుగా ప్రాజెక్టు వివరాలు, సాగు విస్తీర్ణం, నిధుల కేటాయింపు తదితర అంశాలపై తోటపల్లి ప్రాజెక్టు డీఈ రఘునాధనాయుడు, ఏఈ కిశోర్ మ్యాప్ చూపించి వివరించారు. మూడు జిల్లాలకు సాగునీరు అందించే సామర్థ్యం కలిగిన తోటపల్లి ప్రాజెక్టుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కుడి కాలువ ద్వారా 117 కిలో మీటర్ల పొడవున కాలువలు ఏర్పాటు చేశామని, దీనిద్వారా లక్షా31వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా ఇంతవరకు 82వేల ఎకరాలకు నీరు అందించిన ప్రభుత్వం మిగిలిన 50వేల ఎకరాలకు కూడా నీరందించే చర్యలు తీసుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి జగన్ తీసుకున్న నిర్ణయం బాగుందని, బీసీలకు పెద్దపీట వేయడం హర్షణీయమ న్నారు. ఇదే సమయంలో వారికి కీలకమైన అధికారాలు ఇవ్వాలన్నారు. ఈబృందంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యన్నారాయణ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు, జి.ఈశ్వరయ్య, అక్కినేని వనజ, దేగా ప్రభాకర్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మెన్ పి.కామేశ్వర రావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.విమల, సీపీఐ మన్యం జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు, సహాయ కార్యదర్శి జీవన్, కార్యవర్గ సభ్యులు ఈవీ నాయుడు, సూరయ్య, బుడితి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీశ్ ఇంటికి వెళ్లి కొద్దిసేపు రాష్ట్ర రాజకీయాలు, ఎమ్మెల్సీ ఎన్నికలు గూర్చి చర్చించారు. రామకృష్ణను జగదీశ్, టీడీపీ నాయకులు సత్కరించారు.

ఈఎస్ఐసీ ఆధీనంలోకి

గుణదల ఈఎస్ఐ ఆసుపత్రి

- కర్నూలులో 30 పడకల ఆసుపత్రి
- శంషాబాద్‌లో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం
- మరో రెండేళ్లు ఏబీవీకేవై • ఈఎస్ఐసీ సమావేశం నిర్ణయం

చండీగఢ్: ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ గుణదలలో ఉన్న కార్మికరాజ్య బీమా (ఈఎస్ఐ) ఆసుపత్రిని తమ అధీనంలోకి తీసుకుని తామే నిర్వహించాలనీ, తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా రెండు ఈఎస్ఐ ఆస్పత్రులు ఏర్పాటు చేయాలని ఈఎస్ఐ కార్పొరేషన్ నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో 30 పడకల ఆస్పత్రి, తెలంగాణలోని శంషాబాద్‌లో వంద పడకల ఆస్పత్రిని నెలకొల్పాలని నిర్ణయించింది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అధ్యక్షతన సోమవారం చండీగఢ్‌లో జరిగిన 190వ ఈఎస్ఐసీ సమావేశంలో ఈ మేరకు ఆమోదించారు. ఉత్తరప్రదేశ్‌లో 350 పడకల ఆసుపత్రిని, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్‌లో ఒక్కొక్కటి వంద పడకల చొప్పున హాస్పిటల్లను ఏర్పాటు చేయనున్నది. కార్మికుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ఈఎస్ఐసీ ఈ నిర్ణయం తీసుకొన్నట్టు కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. సిక్కింలోని రంగ్‌పోలో ఉన్న 30 పడకల ఈఎస్ఐసీ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా ఆధునికీకరించనున్నారు. రాంచీలోని మైథాన్ ఈఎస్ఐసీ ఆసుపత్రిని కూడా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని సమావేశంలో నిర్ణయించినట్టు కేంద్ర కార్మికశాఖ తెలిపింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని గోల్కొండ వద్ద నిర్మించే ఈఎస్ఐసీ ఆసుపత్రికి రాష్ట్ర ప్రభుత్వం ఐదెకరాల స్థలాన్ని కేటాయించింది. త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోనున్నట్టు రాష్ట్ర మంత్రి సీహెచ్ మల్లారెడ్డి తెలిపారు.

ఈశాన్య రాష్ట్రాలు, సిక్కింలో ఈఎస్ఐ పథకాన్ని నిర్వహించేందుకు ఆర్థిక సహకారాన్ని కొనసాగించాలని కూడా సమావేశంలో నిర్ణయించినట్టు ఆ ప్రకటన తెలిపింది. రెండు సంవత్సరాలు వరుసగా ఈఎస్ఐ చందా చెల్లించి ఉద్యోగం కోల్పోయిన వారికి ఉద్దేశించిన అతల్ బీమిత్ వ్యక్తి కల్యాణ్ యోజన (ఏబీవీకేవై) పథకాన్ని మరో రెండు సంవత్సరాలు పొడిగిస్తూ ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సామాజిక భద్రతా కోడ్-2020అమలుచేస్తున్న నేపథ్యంలో ఈఎస్ఐ లబ్ధిదారులకు వైద్య సేవలను విస్తరించాలని సమావేశం నిర్ణయించింది.

ఏపీ ప్రజల ఆత్మీయత మరువలేనిది

- వీడ్కోలు సభలో గవర్నర్ విశ్వభూషణ్
- రాజ్యాంగ వ్యవస్థల మధ్య సమన్వయం చూపారు: జగన్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్ తనకు రెండో ఇల్లు వంటిదని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనను కుటుంబ సభ్యుడిలా అభిమానించారని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. రాష్ట్ర ప్రజలు తన పట్ల ఎంతో ఆత్మీయతను చూపారన్నారు. విశ్వభూషణ్ హరిచందన్ చత్తీస్‌గఢ్ రాష్ట్ర గవర్నర్‌గా బదిలీ అయిన నేపథ్యంలో ప్రభుత్వం మంగళవారం విజయవాడలో అధికారిక వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించింది. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట ప్రజల తరఫున గవర్నర్‌ను సీఎం ఘనంగా సన్మానించారు. హరిచందన్ మాట్లాడుతూ సీఎం జగన్ తనపై చూపించిన ప్రేమాభిమానాలను ఎప్పటికీ మరిచిపోలేనని చెప్పారు. రాష్ట్రాన్ని వీడుతున్నందుకు బాధగా ఉన్నప్పటికీ...కేంద్ర ప్రభుత్వం తనకు అప్పగించిన చత్తీస్‌గఢ్ గవర్నర్ బాధ్యతలు స్వీకరించాల్సి ఉందన్నారు. రాష్ట్రానికి తాను మూడు సంవత్సరాల ఏడు నెలల పాటు గవర్నర్‌గా ఉన్నానని, సీఎం నేతృత్వంలో అమలు చేస్తున్న కార్యక్రమాలు ఎంతో సంతృప్తిని ఇచ్చాయన్నారు. జనాభాలో అత్యధిక భాగం అధారపడిన వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతు భరోసా కేంద్రాల పథకం అచరణీయమని, దీనిని తాను ప్రధాని నరేంద్రమోదీకి కూడా వివరించానని చెప్పారు. ఎంతో వ్యయంతో కూడుకున్నప్పటికీ పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం సీఎం జగన్‌కే సాధ్యమైందని ప్రశంసించారు. సీఎం జగన్ మాట్లాడుతూ చత్తీస్‌గఢ్ గవర్నర్‌గా హరిచందన్ వెళ్తున్నందుకు అభినందనలు తెలిపారు. గవర్నర్‌గా, ఆత్మీయుడైన పెద్దమనిషిగా వ్యవస్థకు విశ్వభూషణ్ నిండుతనం తెచ్చారన్నారు. రాజ్యాంగ వ్యవస్థల మధ్య సమన్వయం ఎలా ఉండాలన్న దానిని ఈ మూడున్నర సంవత్సరాలలో గవర్నర్ ఆచరణలో గొప్పగా చూపించారని కొనియాడారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఆయా గవర్నర్లకు, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య ఉన్న సంబంధాలపై ఇటీవల చాలారకాల వార్తలు చూస్తున్నామని, మన రాష్ట్రంలో అందుకు భిన్నంగా తండ్రిలా, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కుటుంబ పెద్దలా ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరిస్తూ, తనదైన వాత్సల్యం చూపారన్నారు. హరిచందన్ ఉన్నత విద్యావేత్త, న్యాయ నిపుణుడు మాత్రమే కాదని, నాలుగుసార్లు మంత్రిగా పనిచేసి తాను చేపట్టిన ప్రతి శాఖలోనూ తనదైన ముద్ర వేశారన్నారు. ఐదుసార్లు ఒడిశా అసెంబ్లీకి ఎన్నికయ్యారన్నారు. రాష్ట ప్రజల తరపున అభినందనలతోపాటు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, రాజకీయ కార్యదర్శి ముత్యాలరాజు, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, గవర్నర్ ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకు 26న రాష్ట్ర సదస్సు

ఏపీ జేఏసీ నేతలు బండి శ్రీనివాసరావు, హృదయరాజు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, జప్తు చేసిన డీఏ/డీఆర్ బకాయిలను మంజూరు చేయాలని, కారుణ్య నియామకాలపై వున్న ప్రతిబంధకాలు అడ్డంకులను తొలగించాలని తదితర ఏడు డిమాండ్ల సాధన కోసం ఈ నెల 26వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు విజయవాడ ఎంబీవీకేలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఏపీ జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు, ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్ జి.హృదయరాజు తెలిపారు. మంగళవారం ఏపీ జేఏసీ నేతలు ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏఐఎస్‌జీఈఎఫ్), కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల సమాఖ్య (సీసీజీఈడబ్ల్యూ) కలిపి సంయుక్తంగా ఏర్పడిన జాయింట్ యాక్షన్ కమిటీ (ఎన్‌జేఏసీ) అధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సదస్సుకు ముఖ్యఅతిథులుగా ఏఐఎస్‌జీఈఎఫ్ చైర్మన్ సుభాష్ లంబా, ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీకుమార్ తదితరులు హాజరవుతారని తెలిపారు. దీనికి ఏపీ జేఏసీ సభ్యులు, ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రామ్‌చరణ్‌కు అరుదైన గౌరవం...



హైదరాబాద్: ఆర్‌ఆర్‌ఆర్ తర్వాత మెగా పవర్ స్టార్ రాంచరణ్ తేజ్ ఆర్‌సి15 చిత్రం షూటింగ్‌లో పాల్గొంటున్నాడు. శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కియారా అద్వానీ కథానాయిక. ఎస్వీసీ బ్యానర్‌పై దిల్ రాజు ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇటీవలే రెండు తెలుగు రాష్ట్రాల్లో కొంత భాగం షూటింగ్ జరుపుకోగా... ప్రస్తుతం షూటింగ్‌కు విరామం ఇచ్చారు. ఇదే క్రమంలో చరణ్ తాజాగా మరోసారి అమెరికాకు వెళ్లాడు. ఆస్కార్ నామినేషన్స్ కోసం ఈ మధ్యే మూవీ టీమ్ కొంతకాలం అక్కడే ఉండి వచ్చిన సంగతి తెలిసిందే. ఇక ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని 'నాటు నాటు' సాంగ్ ఆస్కార్ ఫైనల్ నామినేషన్స్‌లో చోటు దక్కించుకుని రేసులో నిలిచింది. ఈ అవార్డుల వేడుక మార్చి 12న జరగనుండగా.. చరణ్ 20 రోజుల ముందే యూఎస్ వెళ్లడంపై అభిమానుల్లో సందేహాలు మొదలయ్యాయి. అయితే వాటన్నింటికీ సమాధానం దొరికేసింది. ఫిబ్రవరి 24న ది బెవర్లీ విల్‌షైర్, ఫోర్ సీజన్స్ హోటల్‌లో జరగనున్న 6వ వార్షిక హెచ్‌సీఏ ఫిల్మ్ అవార్డ్స్‌కు రాంచరణ్ హాజరు కానున్నాడు. 2023 ఆస్కార్ ఫిల్మ్ అవార్డ్స్‌కు సంబంధించి ప్రజెంటర్స్‌లో ఒకరిగా చరణ్ అరుదైన గౌరవం పొందాడు. బ్రాండన్ పెరియా, డేవిడ్ దస్‌మాల్చియాన్, మాడెలిన్ క్లైన్, ట్రినిటీ జో-లి బ్లిస్, వైలెట్ మెక్‌గ్రా తదితరులు సైతం ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుల కార్యక్రమంలో సమర్పకులుగా వ్యవహరించనున్నారు. అందుకే చరణ్ యూఎస్ వెళ్లగా.. సంబంధిత పిక్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. అయితే, రాంచరణ్ అయ్యప్ప మాలలో ఉన్నందున కాళ్లకి చెప్పులు లేకుండానే అమెరికా బయలుదేరాడు. మరో విషయం ఏంటంటే.. బెస్ట్ యాక్షన్ మూవీ, బెస్ట్ ఇంటర్నేషనల్ మూవీ, బెస్ట్ డైరెక్టర్ సహా బెస్ట్ మూవీ తదితర విభాగాల్లో హెచ్‌సీఏ ఫిల్మ్ అవార్డ్స్ 2023 ఫైనల్ నామినేషన్స్‌లో ఆర్‌ఆర్‌ఆర్ చోటు సంపాదించింది. అలాగే ఈ చిత్రంలోని 'నాటు నాటు' పాట ఆస్కార్ ఫైనల్ నామినేషన్లలో చేరిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే.. మిగతా ఆర్‌ఆర్‌ఆర్ టీమ్ మార్చి 7న లాస్ వేగాస్‌కు వెళ్లనుంది. కాగా తారకరత్న హఠాన్మరణం చెందడంతో నందమూరి కుటుంబం విచారంలో ఉన్న నేపథ్యంలో జూనియర్ ఎన్టీఆర్ అక్కడికి వెళ్లే విషయంలో స్పష్టత లేదు. అయితే, ఈ ఈవెంట్‌లో ఆర్‌ఆర్‌ఆర్ టీమ్ లైవ్ పెర్ఫామెన్స్ ఇవ్వనుందని తెలుస్తోంది.

బుమ్రా ఐపీఎల్ ఆడకుంటే ప్రపంచం ఆగిపోదు: ఆకాశ్ చోప్రా

న్యూఢిల్లీ: భారత ఫాస్ట్‌బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఐపీఎల్ ఎంట్రీపై మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్ సీజన్‌లో బుమ్రా ఏడు మ్యాచ్‌లు ఆడకపోయినంత మాత్రాన ప్రపంచం ఏమీ ఆగిపోదని అన్నాడు. ఐపీఎల్ పదహారో సీజన్ మార్చి 31న మొదలు కానుంది. కాగా బుమ్రా పదహారో సీజన్ ఐపీఎల్‌కు అందుబాటులో ఉంటాడా? లేదా? అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. అందుకు కారణం.. జాతీయ క్రికెట్ అకాడమీ ఇంకా బుమ్రాకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలోనే ఆకాశ్ చోప్రా ఈ వ్యాఖ్యలు చేశాడు. 'బుమ్రా మనదేశ సంపద. ఒకవేళ బీసీసీఐ అతడిని ఐపీఎల్‌కు అనుమతించకుంటే ముంబై ఇండియన్స్ అందుకు ఒప్పుకుంటుంది' అని ఆకాశ్ చోప్రా తెలిపాడు. అంతేకాదు ఐపీఎల్‌లో ఈ స్టార్ పేసర్‌పై వర్క్‌లోడ్ పడకుండా చూడాల్సిన బాధ్యత ముంబై ఇండియన్స్, బీసీసీఐపై ఉందని ఈ మాజీ క్రికెటర్ అన్నాడు. ఎన్‌సీఏలో ఉన్న బుమ్రా త్వరలోనే జట్టుతో కలవనున్నాడు. ఈ ఏడాది టీమిండియా రెండు మెగా టోర్నీలు ఆడనుంది. ఒకటేమో.. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్, రెండోది వన్డే వరల్డ్ కప్. ఈ ప్రధాన టోర్నీలకు బుమ్రా ఫిట్‌గా ఉండడం చాలా ముఖ్యం' అని చోప్రా అన్నాడు. కాగా భారత జట్టుకు యార్కర్ కింగ్ బుమ్రా ఎంత కీలక ఆటగాడో తెలిసిందే. అందుకని అతని విషయంలో రిస్క్ తీసుకునేందుకు బీసీసీఐ ఏమాత్రం సిద్ధంగా లేదు. అతను పూర్తిగా కోలుకుని ఫిట్‌నెస్ సాధించేంత వరకు ఆగాలని భావిస్తోంది. కాబట్టే బుమ్రాను ఆస్ట్రేలియాతో బోర్డర్- గవాస్కర్ ట్రోఫీ ఆఖరి టెస్టులకు, మూడు వన్డేల సిరీస్‌కు కూడా బీసీసీఐ ఎంపిక చేయలేదు. పోయిన ఏడాది ఇంగ్లండ్ పర్యటనలో బుమ్రా స్ట్రెస్ ఫ్రాక్చర్‌తో బాధ పడ్డాడు. దాంతో, ఆసియా కప్, టీ20 వరల్డ్ కప్ కూడా ఆడలేదు. వెన్నునొప్పితో బాధపడుతున్న బుమ్రా క్రికెట్‌కు దూరమై దాదాపు ఐదు నెలలు కావొస్తోంది.

మా బ్యాటర్లకు సలహాలివ్వడానికి సిద్ధం: హెడెన్

న్యూఢిల్లీ: బోర్డర్ –గావస్కర్ ట్రోఫీలో భారత స్పిన్నర్ల మాయాజాలానికి బలైపోతున్న ఆసీస్ బ్యాటర్లకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆ జట్టు మాజీ ఆటగాడు మాథ్యూ హెడెన్ ప్రకటించాడు. కాగా బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో భారత్ ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. ఇప్పటివరకు జరిగిన రెండు టెస్టుల్లోనూ టీమ్‌ఇండియా ఘన విజయం సాధించి నాలుగు టెస్టుల సిరీస్‌ని 2–0 ఆధిక్యంలో నిలిచింది. ఆసీస్ బ్యాటర్లు భారత స్పిన్నర్లను ఎదుర్కొలేక వికెట్లను సమర్పించుకుంటున్నారు. రెండు టెస్టుల్లో 40 వికెట్లు కోల్పోతే అందులో 32 వికెట్లు అశ్విన్, జడేజా పడగొట్టినవే. ఈ నేపథ్యంలో స్పిన్ బౌలింగ్ ఆడటంలో ఇబ్బందిపడుతున్న ఆస్ట్రేలియా బ్యాటర్లకు సూచనలు, సలహాలు అందిస్తానని హెడెన్ ముందుకొచ్చాడు. ఆస్ట్రేలియా జట్టు మేనేజ్‌మెంట్ కోరితే 100 శాతం... రాత్రి పగలు అనే తేడా లేకుండా ఏ సమయంలోనైనా తాను సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నాడు. వారికి సమయం కేటాయించినందుకు డబ్బు తీసుకోనని చెప్పాడు. కానీ, ప్రస్తుత తరం ఆటగాళ్లకు పాత తరం ఆటగాళ్ల మధ్య సంబంధాలు మెరుగుపడేలా క్రికెట్ ఆస్ట్రేలియా చర్యలు చేపట్టాలని కోరాడు. ప్రస్తుతం మాథ్యూ హెడెన్ భారత్‌లోనే ఉన్నాడు. బోర్డర్ –గవాస్కర్ ట్రోఫీలో వ్యాఖ్యాతగా చేస్తున్నాడు. అతడికి భారత్‌లో ఎన్నో మ్యాచ్‌లు ఆడిన అనుభవముంది. హెడెన్ సేవలను ఆసీస్ వినియోగించుకుంటుందో లేదో మరికొన్ని రోజుల్లోనే తేలిపోనుంది. ఇక, సిరీస్ విషయాని కొస్తే.. మార్చి 1 నుంచి ఇండోర్ వేదికగా మూడో టెస్టు ప్రారంభం కానుంది.

ప్రముఖ ఎడిటర్ కృష్ణారావు కన్నుమూత



హైదరాబాద్: ప్రముఖ ఎడిటర్, నిర్మాత జి.జి కృష్ణారావు (87) కన్నుమూశారు. మంగళవారం ఉదయం బెంగళూరులో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతిపై పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. జీజీ కృష్ణారావు వివిధ భాషల్లో సుమారు 200కు పైగా చిత్రాలకు ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహించారు. తెలుగులో కళాతపస్వి కె.విశ్వనాథ్, దాసరి నారాయణరావు, బాపు, జంధ్యాల వంటి దిగ్గజ దర్శకుల సినిమాలకు ఆయన సేవలందించారు. కె.విశ్వనాథ్ తెరకెక్కించిన 'శంకరాభరణం', 'సాగర సంగమం', 'స్వాతిముత్యం', 'శుభలేఖ' వంటి సినిమాలతో పాటు శృతి లయలు, సిరివెన్నెల, శుభ సంకల్పం, స్వరాభిషేకం వంటి హిట్ సినిమాలకు ఎడిటర్‌గా పనిచేశారు. దాసరి నారాయణ రావు తెరకెక్కించిన 'బొబ్బిలి పులి', 'సర్దార్ పాపారాయుడు' వంటి చిత్రాలకు ఎడిటర్‌గా సేవలందించారు. 1981లో కె. విశ్వనాథ్ తెరకెక్కించిన 'సప్తపది'కి ఉత్తమ ఎడిటర్‌గా కృష్ణరావు నంది అవార్డు అందుకున్నారు. ఈ సినిమా నుంచి ఎడిటర్ విభాగంలో నంది అవార్డు ఇవ్వడం మొదలు పెట్టారు. అనంతరం 'సాగరసంగమం', 'శుభసంకల్పం' చిత్రాలకు కృష్ణారావు నంది అవార్డులు సొంతం చేసుకున్నారు. ఈ రెండు సినిమాలు కూడా కళాతపస్వి విశ్వనాథ్ దర్శకత్వంలో తెరకెక్కినవి కావడం విశేషం. 'మిలన్', 'ఈశ్వర్', 'సుర్ సంగమ్', 'జ్వర్ భట' 1973, 'మస్తానా' 1970 వంటి సూపర్ హిట్ హిందీ సినిమాలతో పాటు.. 'ఎజుమలైయన్ మహిమై' 1997, 'సలంగై ఓలి' 1983 వంటి అనేక తమిళ సినిమాలకు ఎడిటర్ గా పనిచేశారు. గుడివాడ ఎ.ఎన్.ఆర్. కాలేజీలో ఎమ్మెస్సీ చేసిన జి.జి. కృష్ణారావు మొదట ఆర్మీలో చేరాలని భావించారు. అనుకోకుండా పూనే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ లో ఎడిటింగ్ కోర్సులో చేరారు. 1961-62లో ఎడిటింగ్ కోర్సు చేస్తున్న సమయంలో ప్రముఖ దర్శకులు, ఎడిటర్ ఆదుర్తి సుబ్బారావుగారి దృష్టిలో పడ్డారు. ఆలా చెన్నైలో అడుగు పెట్టిన కృష్ణారావు... 'పాడవోయి భారతీయుడా'తో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి ఎన్నో సూపర్ హిట్ సినిమాలకు ఎడిటర్‌గా చేశారు. కృష్ణారావు మృతికి అనేకమంది సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.





ఓటీటీ వేదికపై ఈ వారం భారీ సినిమాల సందడి!

హైదరాబాద్: ఈ వారం ఓటీటీ వేదిక పై భారీ చిత్రాలు సందడ చేయనున్నాయి. విజయ్ హీరోగా రూపొందిన 'వరిసు' సంక్రాంతి పండుగ సందర్భంగా విడుదలైంది. ఫ్యామిలీ ఎంటర్‌టయినర్ గా మంచి వసూళ్లు రాబట్టిన ఈ సినిమా, ఈ నెల 22వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ కానుంది. ఇక ఈ నెల 23వ తేదీన డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో 'వీరసింహా రెడ్డి' స్ట్రీమింగ్ కానుంది. జనవరి 12వ తేదీన థియేటర్లలో విడుదలైన ఈ సినిమాలో బాలకృష్ణ జోడీగా శ్రుతి హాసన్ నటించింది. కథాకథనాల పరంగా, పాటల పరంగా, డైలాగ్స్ పరంగా ఆకట్టుకున్న ఈ సినిమా, చాలా వేగంగా రూ.100 కోట్ల మార్కును టచ్ చేసింది. వరలక్ష్మి శరత్ కుమార్ నటన ఈ సినిమాకి హైలైట్‌గా నిలిచింది. సందీప్ కిషన్ హీరోగా రంజిత్ జయకోడి రూపొందించిన 'మైఖేల్' ఈ నెల 3వ తేదీనే థియేటర్స్‌కి వచ్చింది. దివ్యాన్ష కౌశిక్ కథానాయికగా నటించిన ఈ సినిమాకి థియేటర్స్ నుంచి ఆశించిన స్థాయిల స్పందన రాలేదు. ఈ సినిమా ఈ నెల 24వ తేదీ నుంచి 'ఆహా'లో స్ట్రీమింగ్ కానుంది. ఇక జనవరి 13న థియేటర్స్ కి వచ్చిన 'వాల్తేరు వీరయ్య' మాస్ ఆడియన్స్ నుంచి మంచి మార్కులు కొట్టేసింది. ఈ నెల 27వ తేదీ నుంచి ఈ సినిమా 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ కానుంది.

చెన్నై సూపర్ కింగ్స్‌కు షాక్!

చెన్నై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ 16వ సీజన్ మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానుండగా చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంఛైజీకి షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్ కైలీ జేమీసన్ టోర్నీకి దూరం కానున్నాడు. వెన్నెముక గాయంతో బాధపడుతున్న ఈ న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ శస్త్రచికిత్స చేయించుకోనున్నాడు. దాంతో, అతను నాలుగు నెలల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. అందుకని ఈ సీజన్‌లో ఈ ఫాస్ట్ బౌలర్ ఆడడం దాదాపు అసాధ్యం. 2023 ఐపీఎల్‌లో తమ జట్టు కప్పు గెలవడంలో జేమీసన్ కీలకం అవుతాడనుకున్న సూపర్ కింగ్స్‌కు నిజంగానే ఎదురు దెబ్బ. ఇప్పటికే అతను స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్‌కు దూరమయ్యాడు. లైన్ అండ్ లెంగ్త్‌తో బ్యాటర్లను ఇబ్బంది పెట్టే ఈ పొడగరి ఆల్‌రౌండర్ కోసం 2021 ఐపీఎల్ మినీ వేలంలో ఫ్రాంఛైజీలు పోటీపడ్డాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ.15 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. అయితే ఆ సీజన్‌లో అతను పెద్దగా ఆకట్టుకోలేదు. దాంతో, జేమీసన్‌ను ఆర్సీబీ రిలీవ్ చేసింది. 2023 వేలంలో చెన్నై సూపర్ కింగ్స్ రూ. కోటికి ఈ ఆల్‌రౌండర్‌ను కొనుగోలు చేసింది. మార్చి 31న ఐపీఎల్ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటన్స్, చెన్నై సూపర్‌కింగ్స్ తలపడనున్నాయి.

డబ్ల్యూటీసీ ఫైనల్లో...ఆరడుగుల ఆరు అంగుళాల పొడవు ఉండే జేమీసన్ కివీస్ బౌలింగ్ లైనప్‌లో చాలా కీలకం. రెండేళ్ల క్రితం జరిగిన ఐసీసీ తొలిసారిగా నిర్వహించిన ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ పోరులో న్యూజిలాండ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. భారత్‌తో జరిగిన ఆ మ్యాచ్‌లో ఇతను ఏడు వికెట్లు తీశాడు. దాంతో, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. ఇప్పటివరకూ 16 టెస్టులు ఆడిన జేమీసన్ 19.45 సగటుతో 72 వికెట్లు పడగొట్టాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.